ప్రజాశక్తి

మంగళవారం 17 జనవరి 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

పెరిగిన 'కాఫీ' కొనుగోలు

- అంతర్జాతీయ ధర కంటే ఎక్కువ చెల్లిస్తోన్న జిసిసి
- ఆ సంస్థకే పంట విక్రయానికి గిరిజన రైతుల మొగ్గు

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి

ప్రస్తుత అంతర్జాతీయ మార్కెట్ ధర కంటే కాఫీ రైతులకు గిరిజన సహకార సంస్థ (జిసిసి) ఎక్కువ ధర చెల్లిస్తోంది. దీంతో, ఆ సంస్థ ద్వారా కాఫీ కొనుగోలు పెరుగుతోంది. కాఫీ సీజన్ ఏటా డిసెంబర్ నుంచి మార్చి వరకూ ఉంటుంది. గత సీజన్లో 150 టన్నుల కాఫీని కూడా కొనుగోలు చేయలేని జిసిసి ప్రస్తుత సీజన్లో ఒక్క డిసెంబర్ నెలలోనే అంతకంటే ఎక్కువగా కొనుగోలు చేసింది. సీజన్ ముగిసేందుకు మరో మూడు నెలల వరకూ సమయం ఉండడంతో కొనుగోళ్లు భారీగా పెరిగే అవకాశం ఉందని జిసిసి వర్గాలు చెప్తున్నాయి. ఇతర వ్యాపారులు, ఐటిడిఎ కంటే ఎక్కువ ధర ఇస్తోంది. రైతుల ఖాతాకు 24 గంటల్లో సొమ్ము జమచేస్తుండడంతో జిసిపి కొనుగోలులో భారీగా వృద్ధి కన్పిస్తోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఏజెన్సీలోని కాఫీ పంట కొనుగోలు, ధర

మిగతా 2లో..

సొసైటీల వారీగా జిసిసి కొన్న కాఫీ

సొసైటీ	కాఫీ కొనుగోలు (టన్నుల్లో)
అరకు	41.11
కాశీపట్నం	2.62
పాడేరు	67.75
పెదబయలు	11.09
ముంచంగిపుట్	10.75
జి.మాడుగుల	13.02
జికెవీధి	14.78
చింతపల్లి	6.31

కాఫీ రైతులతో మాట్లాడుతున్న జిసిసి ఎండి సురేష్ కుమార్ (ఫైల్ ఫొటో)

వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ, విశాఖ

తెలుగు రాష్ట్రాల మధ్య కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఆదివారం రాత్రి విశాఖలో ఘన స్వాగతం లభించింది. ఈ రైలును వారణాసి నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. సికింద్రాబాద్ నుంచి ఉదయం 11 గంటలకు బయలుదేరి రాత్రి 10.00 గంటలకు విశాఖ చేరుకుంది. ఈ ప్రారంభోత్సవ ప్రత్యేకతలను తెలియజేసేందుకు ఈస్ట్ కోస్ట్ రైల్వే అధికారులు విశాఖపట్నం మీడియా బృందానికి సావనీర్ పాస్‌లను అందించి ప్రత్యేక రైలులో రాజమండ్రి వరకు తీసుకువెళ్లి అక్కడి నుంచి వందే భారత్ రైలులో విశాఖపట్నం తీసుకువచ్చారు. కేంద్రీయ విద్యాలయం, రైల్వే స్కూల్ చెందిన 350 మంది విద్యార్థులకు కూడా ఈ రైలులో తొలి రోజు ప్రయాణించే అవకాశం కల్పించారు. గంటకు 140 కిలోమీటర్ల సగటు వేగంతో ప్రయాణిస్తూ తక్కువ సమయంలో విశాఖపట్నం చేరుకుంది. రైలులో ఆటోమేటిక్ డోర్ లాకింగ్ సిస్టం, సీసీ కెమెరాలు, ప్రతి సీటుకూ ప్రత్యేక ఛార్జింగ్ పాయింట్లు, బయో వాక్యూమ్ టాయిలెట్లు, ఎల్‌సిడి స్క్రీన్లు ఏర్పాటుచేశారు. డ్రైవర్‌తో నేరుగా ప్రయాణికులు మాట్లాడేందుకు పుష్ టాక్ వ్యవస్థను పొందుపరిచారు. ప్రతి సీటుకూ ఒక రీడింగ్ లైట్ ఏర్పాటుచేశారు.

ఈ సందర్భంగా వాల్తేరు రైల్వే డిఆర్ఎం అనూప్ సత్పతి మీడియాతో మాట్లాడుతూ, ఇటువంటి రైళ్ల భవిష్యత్తులో మరిన్ని ప్రవేశపెట్టేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్/పెయింటింగ్ పోటీల్లో విజేతలకు డిఆర్ఎం బహుమతులు పంపిణీ చేశారు. రాజమండ్రి నుంచి విశాఖ వచ్చే వరకు అన్ని స్టేషన్లలోనూ ఈ నూతన రైలుకు ఘన స్వాగతం లభించింది. సోమవారం ఉదయం 5.45 గంటలకు విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ బయలుదేరింది.

వందే భారత్ రైలుకు స్వాగతం పలుకుతున్న ప్రయాణికులు

వడ్లపూడి రైల్వే వంతెనకు మోక్షమెప్పుడో

వార్త 4లో..

అఖిల భారత మహాసభలకు తరలిన సిఐటియు నాయకులు

వార్త 2లో..

దుకాణ సముదాయం.. హామీకే పరిమితం

వార్త 4లో..

దీక్షలో కూర్చున్న ఆవాజ్, సిఐటియు నాయకులు

స్టీల్‌ప్లాంట్ రక్షణకు ప్రజా ఉద్యమం

ఆవాజ్ జిల్లా కార్యదర్శి అష్రాఫ్

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ప్రజాఉద్యమం చేపడతామని ఆవాజ్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి అష్రాఫ్ తెలిపారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక సంఘాల జెఎసి చేపట్టిన దీక్షలు మంగళవారం నాటికి 655వ రోజుకు చేరాయి. ఈ దీక్షల్లో ఆవాజ్, సిఐటియు మద్దిలపాలెం జోన్ నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా అష్రాఫ్ మాట్లాడుతూ, తెలుగు ప్రజలు పోరాడి సాధించుకున్న ప్రభుత్వ రంగ సంస్థ స్టీల్‌ప్లాంట్ అన్నారు. దీనిని అమ్మే హక్కు ఏ ఒక్కరికీ లేదన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను

మిగతా 2లో..

మత్స్యకారుల ఆయిల్ సబ్సిడీ బకాయి రూ.2.70 కోట్లు

ఏళ్ల తరబడి చెల్లించని ప్రభుత్వం

ప్రజాశక్తి - కలెక్టరేట్, విశాఖ

ఫిషింగ్ హార్బర్‌లోని బోటు ఆపరేటర్లకు ప్రభుత్వం ఆయిల్ సబ్సిడీగా రూ.2.70 కోట్లు బకాయి పడింది. ఏళ్ల తరబడి ఈ బకాయి సొమ్మును వైసిపి ప్రభుత్వం చెల్లించటం లేదు. బకాయి సొమ్ము చెల్లించాలని కోస్టల్ మెకనైజ్డ్ ఫిషింగ్ బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బర్రి కొండబాబు ఇటీవల ఫిషింగ్ హార్బర్‌లో ఒక కార్యక్రమం కోసం హాజరైన రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి సీదరి అప్పలరాజుకు వినతిపత్రం సమర్పించారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బోటు ఆపరేటర్లకు లీటర్ పెట్రోల్‌పై రూ.6 సబ్సిడీ అమలు చేశారని, ఇదే విధానాన్ని చంద్రబాబు ప్రభుత్వం కూడా అమలు జరిపిందని, 2019 ఎన్నికల నాటికి బోటు ఆపరేటర్లకు సబ్సిడీ బకాయి రూ.2.70 కోట్లు ఉందని వివరించారు. ప్రభుత్వం మారిన తర్వాత ఈ సబ్సిడీని ఇంతవరకు బోటు ఆపరేటర్లకు చెల్లించలేదని పేర్కొన్నారు.

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత బోటు ఆపరేటర్లకు డీజిల్‌పై ఇస్తున్న సబ్సిడీ రూ.6 నుంచి రూ.9.30కి పెంచారు. గతంలో బోటు ఆపరేటర్లు 1000 లీటర్ల డీజిల్ కొనుగోలు చేస్తే, మొత్తం సొమ్మును ముందుగా చెల్లించి డీజిల్ తీసుకునేవారు. ఈ విధంగా సొమ్ము చెల్లించిన వారికి ప్రభుత్వం ఆ తర్వాత లీటర్‌కు రూ.6 సబ్సిడీ సొమ్మును తిరిగి చెల్లించేది. ఈ విధంగా బోటు యజమానులు చెల్లించిన సొమ్ముకు సబ్సిడీ రూపంలో రావలసిన రూ.2.70 కోట్లు ఉంది. వైసిపి ప్రభుత్వం వచ్చాక సబ్సిడీ చెల్లింపు విధానంలో మార్పు తీసుకొచ్చింది. బోటు యజమానులు డీజిల్‌ను కొనుగోలుచేసే సమయంలో సబ్సిడీ సొమ్ము మినహాయించుకొని మిగిలిన సొమ్మును చెల్లించే విధానం ప్రవేశపెట్టారు. ఇందువల్ల సబ్సిడీ బకాయిలు సమస్య ఉత్పన్నం కాలేదు. బోటు ఆపరేటర్లకు బకాయి ఉన్న సబ్సిడీ సొమ్మును ప్రభుత్వం మారినంత మాత్రాన చెల్లించకపోతే ఎలా అని బోటు ఆపరేటర్లు ప్రశ్నిస్తున్నారు.

ముఖ్యమంత్రికి లేఖ ఇచ్చా

బకాయి విషయమై ఆంధ్రప్రదేశ్ మత్స్యకారుల కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులను సంప్రదించగా విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ బోర్డు ఆపరేటర్లకు ప్రభుత్వం సబ్సిడీ బకాయి సుమారు రూ.3 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ బకాయి గత ప్రభుత్వంనాటిదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి దష్ట్యా, అనేక సంక్షేమ పథకాలు అమలు కారణంగా సబ్సిడీ సొమ్ము బకాయి చెల్లింపులో జాప్యం జరుగుతుందన్నారు. విశాఖపట్నంలో మాత్రమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా బోటు ఆపరేటర్లకు సబ్సిడీ బకాయి సొమ్ము సుమారు 5.6 కోట్లు ఉంటుందన్నారు. బకాయిలు చెల్లించాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి తాను ఈసరికే రెండు పర్యాయాలు వినతి పత్రాలు ఇచ్చానని, తాజాగా మరోసారి లేఖ రాశానని తెలిపారు. త్వరలోనే ఈ సమస్య పరిష్కారం అవుతుందని భావిస్తున్నానన్నారు.

మొదటి పేజీ తరువాయి..

పెరిగిన 'కాఫీ' కొనుగోలు

పెంపుపై జిసిసి ఎండి సురేష్‌కుమార్ తీసుకున్న ముందస్తు చర్యలు, ప్రత్యేక శ్రద్ధ ఇందుకు దోహదపడ్డాయి. పాడేరు ఏజెన్సీలోని అనంతగిరి, అరకు, డుంబ్రిగుడ, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్, పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, జికె వీధి, కొయ్యూరు మండలాల్లో 1.80 లక్షల మంది రైతులు దాదాపు రెండు లక్షల ఎకరాల్లో కాఫీ సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వెయ్యి టన్నులకుపైగా కాఫీ కొనుగోలు చేయాలని జిసిసి లక్ష్యంగా పెట్టుకుంది. ఒక్క డిసెంబర్ నెలలోనే 168 టన్నుల కాఫీని గిరిజన రైతుల నుంచి కొనుగోలు చేసింది. అరబిక పార్చ్‌మెంట్ కిలో కాఫీకి అంతర్జాతీయ మార్కెట్లో రూ.255 రేటు పలుకుతుండగా జిసిసి రూ.270 చెల్లిస్తోంది. వ్యాపారుల బారినపడి మోసపోకుండా గిరిజన కాఫీ రైతులను ఆదుకోవడానికి జిసిసి ఎండి చేసిన కృషి ఫలితాలనిస్తోంది. ఈ ఏడాది పార్చ్‌మెంట్ కాఫీ కిలోకు రూ.270, చెర్రీకి రూ.135, రొబస్టాకు రూ.60 ధర నిర్ణయించి జిసిసి చెల్లిస్తోంది. ఈ ధరలు ఆశాజనకంగా ఉండడంతో జిసిసికి కాఫీ విక్రయించడానికి గిరిజన రైతులు మొగ్గుచూపుతున్నారు. గత నెలాఖరు నాటికి పార్చ్‌మెంట్ కాఫీ 149 టన్నులు, చెర్రీ రకపు కాఫీ 19 టన్నులు కొనుగోలు చేసింది. వీటి విలువ రూ.4.28 కోట్లు ఉంది. అంతర్జాతీయంగా వియత్నాం, బ్రెజిల్ తదితర దేశాల్లో కాఫీ దిగుబడులు తగ్గడం, అంతర్జాతీయ గుర్తింపు కలిగిన పాడేరు ఏజెన్సీలోని కాఫీ పంటకు మంచి గిరాకీ ఉండడంతో జిసిసి చొరవ తీసుకొని ప్రయివేటు వ్యాపారుల కంటే ఎక్కువ ధర చెల్లించి కొనుగోలు చేస్తోంది. జిసిసి నిర్ణయించిన ధరకుమించి ప్రయివేటు వ్యాపారులు కొనుగోలు చేయడానికి ముందుకు రాకపోవడంతో రైతులు జిసిసి కొనుగోలు కేంద్రాలకు తెచ్చి కాఫీని విక్రయిస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణకు ప్రజా ఉద్యమం

అమ్మేస్తామని మోడీ పదే పదే ప్రకటనలు చేస్తున్నా, కార్మిక, ప్రజాసంఘాల ఉద్యమంతో ముందుకు సాగలేకపోతుందని గుర్తుచేశారు. ఈ ఏడాది విశాఖ జిల్లాలతోపాటు ఆంధ్ర రాష్ట్రంలో ప్రజా ఉద్యమంగా మార్చేందుకు కార్మిక, ప్రజా సంఘాలు ఇప్పటికే నిర్ణయించాయని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి బిజెపి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలన్నీ ప్రజలు తిప్పికొడతారని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌లో ఉపాధి పొందుతున్న లక్షలాదిమంది కుటుంబాలను రోడ్డున పడేసే నిర్ణయాన్ని బిజెపి నాయకులు వ్యతిరేకించాలని కోరారు. లేకుంటే 2024 ఎన్నికల్లో బిజెపికి నామరూపాలు లేకుండా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకట్రావు, ఎ.సీతాలక్ష్మి, కె.కుమారి, పెన్షనర్స్ నాయకులు జివిఎన్ చలపతి, పి.అప్పారావు, ఆవాజ్ నాయకులు మహమ్మద్ అయూబ్, అబ్దుల్ మునీర్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

గాలి పటాలతో పక్షులకు హాని కలిగించొద్దు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : పక్షులకు హాని కలిగించకుండా గాలి పటాలు ఎగురవేసుకోవాలని గ్రీన్ క్లైమేట్ టీమ్ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పూర్వం గాలి పటాలు కాగితాలతో తయారు చేసే వారు, నూలు దారం కట్టే వారు దీని వల్ల పెద్దగా నష్టం వాటిల్లేది కాదని తెలిపారు. ప్రస్తుతం చైనా మాంజా దారాలు, ఒక్కసారి వాడి వదిలేసే ప్లాస్టిక్ పతంగులు మార్కెట్లోకి వచ్చాయని, ఇవి పక్షి సంతతికి, ఉడతల్లాంటి చిన్న జీవరాశికి ప్రాణాంతకంగా మారాయని పేర్కొన్నారు. 1972 వన్య ప్రాణుల రక్షణ చట్టం క్రింద వన్య ప్రాణులకు, హాని కలిగించినా, చంపినా నేరమేనని తెలిపారు. నూలు దారం, పేపర్ కాగితంతో చేసిన గాలి పటాలను మాత్రమే వినియోగించాలని కోరారు.

లీడ్ స్టూడెంట్ ఛాంపియన్ షిప్ విజేతలుగా విద్యాభవన్ విద్యార్థులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఎడ్‌టెక్ కంపెనీ లీడ్ చాంఫియన్‌షిప్ 2022 విజేతలను వెల్లడించింది. దేశ వ్యాప్తంగా 3000 లీడ్ భాగస్వామ్య స్కూల్స్‌లోని 1.2 మిలియన్ల 9వ తరగతి లోపు ప్రీ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విశాఖకు చెందిన భారతీయ విద్యాభవన్ పబ్లిక్‌స్కూల్ విద్యార్థులు ధృవిక.ఎల్ ఇంగ్లీష్ చాంప్స్ జూనియర్ విభాగంలో ఫైనలిస్ట్‌గా నిలిచారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రజ్ఞ ఇన్నోవేటివ్ స్కూల్ ప్రిన్సిపల్ పి.పురుషోత్తమాచారి మాట్లాడుతూ తమ విద్యార్థులు నవ్య , హిమవర్ష లీడ్ చాంఫియన్‌షిప్ 2022 సాధించిన విజయం పట్ల సంతోషంగా ఉన్నామన్నారు. లీడ్‌తో భాగస్వామ్యం చేసుకోవడం వల్ల భావి విద్యావసరాలను తీర్చే రీతిలో సిద్ధం కావడంలో సహాయపడింది అని పేర్కొన్నారు.

గుడ్డు కొత్త రికార్డు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : కోడిగుడ్ల ధరలు అంతకంతకు పెరుగుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో ఒక గుడ్డు ధర రూ.7గా ఉంది. ఇటీవల వరకు డజను గుడ్ల ధర రూ.72 ఉండగా, రెండు రోజులుగా రూ.76కి చేరింది. అయితే రైతుకు మాత్రం ఒక్కో గుడ్డు ధర రూ.5.54 చొప్పున చెల్లిస్తున్నారు. 100 గుడ్ల ధర రూ.580గా పత్రికల్లో పేర్కొంటున్నారు. నాలుగేళ్ల తర్వాత ఇంత అత్యధిక ధర వస్తున్నట్లు హోల్ సేల్ వ్యాపారులు అంటున్నారు. పౌల్ట్రీ రంగంలో సరికొత్త రికార్డు నమోదు చేసిందంటున్నారు. రిటైల్ మార్కెట్‌లో గుడ్డు రూ.7కు చేరడంతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పౌల్ట్రీల్లో గుడ్లు పెట్టే కోళ్లు 1.4 కోట్ల వరకు ఉండగా రోజుకు 1.10 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో రోజుకు 25 లక్షల గుడ్లు ఉత్పత్తి అవుతున్నట్లు తెలిసింది. మన రాష్ట్రం నుంచి 60 శాతం పశ్చిమబెంగాల్, ఒడిశా, బీహార్, ఝార్ఖండ్ వంటి రాష్ట్రాలకు గుడ్లు ఎగుమతి అవుతుండగా మిగిలినవి స్థానికంగా వినియోగిస్తున్నారు. శీతాకాలంలో ఉత్తరాది రాష్ట్రాల్లో చేపల లభ్యత తక్కువగా ఉండటంతో గుడ్ల వినియోగం పెరుగుతోంది. ఫలితంగా ఎగుమతులు పుంజుకొని అత్యధిక ధర లభిస్తుంది. 2017వ సంవత్సరం సీజన్లో రైతు దగ్గర ధర అత్యధికంగా రూ.5.45 లభించింది. ఒడిశా, పశ్చిమ బెంగాల్లో పౌల్ట్రీలు విస్తరించడం, ఎగుమతుల్లో ఇతర రాష్ట్రాలు నాలుగేళ్లుగా పౌల్ట్రీ రంగంలో ప్రవేశించడంతో మన రాష్ట్రంలో పౌల్ట్రీ రంగం గడ్డు కాలం ఎదుర్కొంటోందని అంటున్నారు. ఈ సీజన్‌లో శీతలం ఎక్కువగా ఉండటంతో ఇతర రాష్ట్రాల్లో గుడ్లకు డిమాండ్ పెరిగింది. ఇదే సందర్భంలో వాళ్లకు వినియోగించే మేత ధరలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. మేతకు వినియోగించే మొక్కజొన్న, సోయా, నూకలు ధరలు విపరీతంగా పెరిగాయి. మందుల ధరలు పెరిగాయి. విద్యుత్తు, రవాణా చార్జీలు, పౌల్ట్రీలో పనిచేసే కార్మికుల వేతనాలు పెరగడంతో గుడ్ల ఉత్పత్తి ధర పెరిగిందని పౌల్ట్రీ యజమానులు అంటున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పౌల్ట్రీకి కొంతమేర రాయితీలు కల్పించాలని కోరుతున్నారు. నగరంలోని రైతు బజార్లలో సైతం గుడ్ల ధరలు పెరిగాయి. ప్రస్తుతం రైతు బజార్లలో డజను రూ.74కు అమ్ముతున్నారు. అవి కూడా సైజులో చిన్నవిగా ఉంటున్నాయని వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు.



అఖిల భారత మహాసభలకు తరలిన సిఐటియు నాయకులు

అఖిలభారత మహాసభలకు బయలుదేరిన సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : బెంగళూరులో ఈ నెల 18 నుంచి 22 వరకు జరగనున్న సిఐటియు అఖిలభారత మహాసభలకు విశాఖపట్నం జిల్లా కమిటీ నుంచి పలువురు ప్రతినిధులు సోమవారం రైల్లో తరలివెళ్లారు. బెంగళూరు వెళ్ళిన వారిలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి బి.జగన్, జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి కెవిపి చంద్రమౌళి తదితరులు ఉన్నారు.

కృష్ణా గార్డెన్స్‌లో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : డాబాగార్డెన్స్‌లోని కృష్ణా గార్డెన్స్‌లో డివైఎఫ్ఐ, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యాన ఆదివారం రాత్రి మహిళలకు ముగ్గుల పోటీలు, యువకులకు, పిల్లలకు క్రీడలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలచే సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేశారు. ముగ్గుల పోటీలకు న్యాయ నిర్ణేతలుగా మాజీ కార్పొరేటర్, కీర్తిశేషులు వానపల్లి రవికుమార్ సతీమణి గాయత్రి, మరికొంతమంది మహిళలు వ్యవహరించారు. క్రికెట్ పోటీల్లో ఐదు జట్లు పాల్గొన్నాయి. ఆయా పోటీలలో విజేతలకు బహుమతులను అందజేశారు. కర్రి అప్పలరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా నాయకులు గణేష్, సిఐటియు నాయకులు ఎం.సుబ్బారావు, కెవిపి చంద్రమౌళి, కర్రి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులను అందజేస్తున్న వానపల్లి గాయత్రి

ముగిసిన త్యాగరాజ ఆరాధనోత్సవాలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : కళాభారతిలో ఆరు రోజులుగా నిర్వహిస్తున్న త్యాగరాజ ఆరాధన ఉత్సవాలు సోమవారం సాయంత్రం ముగిసాయి. సోమవారం సాయంత్రం జరిగిన సీనియర్ కచేరిలలో నిఖిత శ్రీవల్లి, మాణిక్య లక్ష్మి, వారణాసి సునయన చక్కగా పాడారు. తర్వాత ఇంద్రగంటి కాళీ ప్రసాదు ఫ్లూట్ శ్రవణానందంగా వాయించారు. డాక్టర్ మాధురీదేవి వీణవాదనం కచేరి ప్రత్యేకంగా నిలిచింది. చివరగా గుమ్ములూరి శారద సుబ్రహ్మణ్యం గాత్రంతో ఉత్సవాలకు చక్కటి ముగింపు ఇచ్చారు. ఆఖరి కచేరి అనంతరం ఆంజనేయస్వామి ఉత్సవం జరిపి, హనుమాన్ చాలీసా పారాయణ 300 మంది పాడి, ఆంజనేయ స్వామికి 108 వడల మాలను సమర్పించారు. తర్వాత రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదం పారాయణ చేశారు. ఈ ఆరు రోజులు కార్యక్రమాల్లో 327 కచేరీలు, 815 మంది కళాకారులు పాల్గొన్నారు. అమెరికా, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, బిలాయి, హైదరాబాద్, రాజమండ్రి, కాకినాడ, విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం, అనకాపల్లి తదితర ప్రాంతాల నుంచి కళాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో మంతెన సత్యనారాయణ రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, పైడా కృష్ణప్రసాద్, సుసర్ల రామ్ గోపాల్, మోహన్ దాస్, జగత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

NO.3. ORDER 5 RULE 3
SUMMONS TO APPEAR IN PERSON
IN THE HONOURABLE COURT OF THE JUNIOUR CIVIL JUDGE AT GAJAPATHINAGARAM
O.S. 86/2021

Between:
Paritala Ram Narasimha Das and others. . . . Plaintiffs.
And:
Somula Seetamma and others. . . . Defendant.

To,
Akshaya Gold Farms and Villas India Pvt., Ltd., Vishkhapatnam Represented by it's Manging Director,
Bhogi Subramanayam,
S/o.Seeta Rama Swamy,
R/o. DwaraKa Naga, HDFC Bank,
4th Akshaya Boold,
Vishkhapatnam-530003

Whereas you the plaintiff has instituted a suit against you, you are hereby summoned to appear in this court in person on **25th day of January 2023 at 10- 30 (A.M.)** hours to answer the claim, and further you hereby directed to file within 30 days of service of summon a written statement of your defense and you are directed to produce 'on that day all documents upon which you intend to rely in supporting of your defense.

Take notice that in default of your appearance on the day before mentioned, the suit will be heard and determined in your absence.

REDDY SRINIVASA NAIDU,
Advocate.
Gajapthinagaram.

Gajapathinagaram,
Date: 16-01-23

నోటీసు
మహారాజశ్రీ గణపతినగరం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
O.S.No.86/2016 I.A. 141/2021

పరిటాల రామనర్సింహదాసు వగైరా . . . పిటిషనర్సు
సోమాలు సీతమ్మ వగైరాలు . . . రెస్పాండెంట్సు

To,
Akshaya Gold Farms and Villas India Pvt., Ltd., Vishkhapatnam Represented by it's Manging Director,
Bhogi Subramanayam,

పై నెంబరు దావాలో దావా షెడ్యూలు, దాఖలా భూములకు పిటిషనరు యొక్క అనుభవమును మిమ్మాలను జోక్యం కలుగుచేసుకొనకుండా ad exparte interim injunction యిమ్మని కొరుచు పిటిషను దాఖలు చేసినందున యిందు విషయమై నీకు ఆక్షేపణలున్న **తే:25-1-2023దిన ఉదయం 10-30 గంటలకు** ఖద్దున గాని వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై మనవి చేసుకోవలసింది లేని యెడల సదరు విషయమై నీ పరోక్షమున విచారించి తీర్మానము చేయుదురు అని యీ ప్రకటన మూలంగా తెలియజేయడమైదిన.

రెడ్డి శ్రీనివాసనాయుడు
అడ్వకేట్, గజపతినగరం,
విజయనగరం జిల్లా.

తే: 16-01-2023

కార్మికవాడలో కానరాని సంక్రాంతి శోభ

- జ్యూట్ మిల్లు శాశ్వత మూసివేతతో కళావిహీనంగా కార్మికుల క్వార్టర్స్
- కూలీలుగా మారిన నాటి కార్మికులు..
- ఇది ముమ్మాటికీ పాలకుల పాపమే!

జ్యూట్‌మిల్లు ప్రధాన మార్గం ..

నేలమట్టమైన జ్యూట్ మిల్లు ప్రాంతం ఇదే

ప్రజాశక్తి -తగరపువలస : ప్రభుత్వాలు, పాలకుల వైఫల్యం కారణంగా చిట్టివలస జ్యూట్‌మిల్లు 2009 ఏప్రిల్ 20న మూతబడింది. కార్మికులు, కార్మికుల కుటుంబాలతో కళకళలాడిన ఈ ప్రాంతం నేడు కళా విహీనంగా దర్శనమిస్తోంది. జ్యూట్‌మిల్లులో పనిచేసిన ఒకప్పటి కార్మికులు నేడు కుటుంబపోషణకు దినసరి కూలీలు, సంచార వర్తకులుగా మారి దయనీయంగా జీవనం సాగిస్తున్నారు.ఒకపుడు సందడిగా ఉన్న ప్రాంతం సంక్రాంతి పండుగకు వెలవెలబోతుండడంపై పలువురు విచారం వ్యక్తం చేస్తున్నారు.

నేలమట్టమైన ఘన చరిత్ర

ఎంతో ఘనచరిత్ర కలిగిన జ్యూట్‌మిల్లు పాలకుల చేతకానితనానికి నేడు నేలమట్టమైంది. ఈ పాపంలో అప్పట్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ తర్వాత అధికారంలోకి వచ్చిన టిడిపి, ప్రస్తుత వైసిపి ప్రభుత్వాలు భాగమే అని కార్మిక కుటుంబాలు ఆవేదనతో అంటున్నాయి. అతి పురాతనమైన చిట్టివలస జ్యూట్ మిల్లు లో సుమారు ఆరు వేల మంది కార్మికులు పని చేసేవారు. పరోక్షంగా కొన్ని వందల కుటుంబాలు ఉపాధి పొందేవి. భీమిలి అర్బన్, రూరల్, పక్కనే ఉన్న భోగాపురం మండలం నుంచి 52 గ్రామాలకు చెందిన వారు జ్యూట్ కార్మికులుగా పని చేసేవారు. ఎంతో నైపుణ్యం గల కార్మికులు ఇక్కడ ఉండేవారు. అంతే నైపుణ్యం గల గోనె సంచులు తయారీ ఇక్కడ జరిగేది. ఉత్పత్తిలో మేటిగా ఉండేది. ఒక విధంగా చెప్పాలంటే ఉమ్మడి రాష్ట్రంలోనే అతి పురాతనమైన ఈ జ్యూట్ మిల్లును 1921లో దీన్ని స్థాపించారు. అప్పట్లో బ్రిటిష్ పాలకుల ఆధ్వర్యంలో నడిచిన ఈ మిల్లు, స్వాతంత్ర్యానంతరం ప్రైవేట్ పెట్టుబడి దారుల చేతుల్లోకి వెళ్లింది.

మిల్లు మూతతో రోడ్డున పడ్డ కుటుంబాలు

సుమారు 14 ఏళ్ల క్రితం జ్యూట్ మిల్లు మూతపడింది. దీంతో ఉపాధి కోసం కార్మికులు చెట్టుకొకరు పుట్టకొకరుగా వెళ్ళిపోయారు. జ్యూట్ ఆస్తులను యాజమాన్యం అమ్మేసుకోడం ఇప్పటికే ప్రారంభించింది. యంత్రాలు తరలించుకు పోయారు. చరిత్ర ఆనవాళ్లు కనబడకుండా నేలమట్టమయ్యాయి.

సెక్యూరిటీ గార్డు, సంచార పూలవ్యాపారిగా మారిన కార్మికులు

నాటి కార్మికులు...నేడు కూలీలు

జ్యూట్ మిల్లు నడిచేటప్పుడు జీవనం సాగించిన కార్మికుల్లో ఎక్కువ శాతం నేడు కూలీలుగా మారారు. వారి ప్రస్తుత జీవన స్థితిగతులు చూస్తే దయనీయమనే చెప్పాలి. నగరంలో సెక్యూరిటీ గార్డులుగానూ, కాంట్రాక్ట్ పనివారలుగాను, వీధుల్లో పూలు అమ్ముకుంటూ కొందరు, ఇలా చెప్పుకుంటూ పోతే వారి జీవనం కడు దుర్భరమనే చెప్పాలి. నాడు సంక్రాంతి పండుగ జ్యూట్ కార్మికుల ఇళ్లల్లో కొత్త బట్టలు, పిండి వంటలు కనిపించే పరిస్థితి ఉండేది. నేడు ఆ పరిస్థితి కాన రాలేదు.

కళ తప్పిన కార్మికవాడ...

దాదాపు 560 జ్యూట్ క్వార్టర్లు ఉన్న కార్మికవాడ నేడు వెలవెల బోతోంది. మిల్లు శాశ్వతంగా మూతబడడంతో మిల్లు యాజమాన్యం ఇచ్చే అరకొర పరిహారం అందుకున్న కార్మికులు ఎక్కువ శాతం క్వార్టర్లను ఖాళీ చేశారు.

నేరాలు ఘోరాలు

ఇద్దరు కోడిపందెం రాయుళ్ల అరెస్ట్

ప్రజాశక్తి- కశింకోట: మండలంలోని పి.సోమవారం గ్రామ పొలిమేరల్లో కోడిపందేలు నిర్వహిస్తున్న గొంతిన ప్రసాద్, బొమ్మిశెట్టి కృష్ణ ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఆదినారాయణ రెడ్డి తెలిపారు. నిందితుల నుంచి రూ.410నగదు, రెండు కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నారు

గుండాటలో నలుగురిపై కేసు నమోదు

ప్రజాశక్తి- కశింకోట: జెంటపురెడ్డి తుని గ్రామంలో బల్లాట ఆడుతున్న యలమంచిల్ గణేష్, రాపేటి శ్రీనివాస్, యర్రా దుర్గాప్రసాద్, రాము నలుగురు ముద్దాయిలను సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఆదినారాయణరెడ్డి తెలిపారు. నిందితుల నుంచి రూ. 1783నగదు, ఆరు డైస్ నాణేలు, ప్లాస్టిక్ నంబరింగ్ షీట్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఘనంగా జోగి రమేష్ జన్మదిన వేడుకలు

చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

ప్రజాశక్తి -గాజువాక : రాష్ట్ర గహ నిర్మాణ శాఖామంత్రి జోగి రమేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని వైసిపి రాష్ట్రనేత ఏకుల వెంకటేష్ ఆధ్వర్యంలో వినాయకనగర్‌లో పేదలకు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఫాస్టర్ కేత అప్పారావు, దంత వైద్యనిపుణులు డాక్టర్ ఆర్గానిక్ కరుణాకర్, జెర్రిపోతుల గోవిందరావు పాల్గొన్నారు.

ముగిసిన బిసిఎల్ క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి-పిఎం.పాలెం : బిసిఎల్ సీనియర్ జట్టు సారథ్యంలో పివిఆర్ సన్స్, ఎల్ ఎన్ కనస్ట్రక్షన్స్, ఎస్ఎస్ఎస్ కనస్ట్రక్షన్స్, ఎస్‌వి సర్వేయర్స్, జీవీర్ రియల్ ఎస్టేట్, ఎస్‌పిఎల్ఎస్ లారీ సర్వీసెస్, మాతృశ్రీ కనస్ట్రక్షన్స్, శ్రీనివాస్ స్కూల్, యాపిల్ ప్రమోటర్స్ దాసరి కోటేశ్వరరావు సహాయ సహకారాలతో నిర్వహించిన బక్కన్నపాలెం క్రికెట్ లీగ్ పోటీలు సోమవారం ముగిసాయి. టైటిల్ స్పాన్సర్‌గా పోతినరాము కుమారుడు పోతిన భాస్కరరావు వ్యవహారించారు. విజేతలకు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ త్రినాథ్, లీగల్ చైర్మన్ ఎస్ఎస్ఎన్ రాజు బహుమతులు అందించారు. 1కోనేటి నవీన్, పోతిన మహేష్, పోతిన శేఖర్, పిళ్ళా జయదేవ్ పాల్గొన్నారు.

బోసిపోయిన గాజువాక

ప్రజాశక్తి -గాజువాక : సంక్రాంతి సందర్భంగా పారిశ్రామిక ప్రాంతం గాజువాకలోని ప్రజలు సొంతూళ్లకు తరలివెళ్లడంతో గాజువాకలో అన్ని రహదారులు బోసిపోయాయి. కిటకిటలాడే పాత గాజువాక, కొత్త గాజువాక, కణితి రోడ్డు, బిసి రోడ్డు ప్రాంతాలన్నీ ఖాళీగా ఉన్నాయి. గాజువాకలో పలు హోటల్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లన్నీ మూతబడ్డాయి.

నిర్మానుష్యంగా ఉన్న గాజువాక రోడ్డు

వైభవంగా భజన చెట్టు ఊరేగింపు

భజన చెట్టు ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ ప్రజలు

ప్రజాశక్తి మాధవధార : కనుమ పండుగ సందర్భంగా శ్రీ మాధవ యువజన సమాజం ఆధ్వర్యంలో భజన చెట్టు మాధవధార కోదండ రామాలయం భజన కళాకారులచే మాధవధార, కళింగనగర్, మురళీనగర్ తదితర ప్రాంతాల్లో భజనచెట్టు ఊరేగింపు నిర్వహించారు. మాధవ యువజన సమాజం కన్వీనర్ సనపల రావ్‌గోపాలరావు, సహాయ కన్వీనర్ పప్పల రామచంద్రరావు మాట్లాడుతూ మాధవధార ప్రాంతంలో స్వాతంత్రానికి పూర్వంనుంచే ఆవిర్భవించిన మాధవ యువజన సమాజం ఆధ్వర్యంలో ధనుర్మాసం సందర్భంగా మాధవధార ప్రజల సహకారంతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానికులు సనపల జగదీశ్వరరావు, కంచరానా రమేష్ కుమార్, పేడాడ వెంకటరావు, సనపల వరదరాజు, నంబాల ఉదంతరావు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

సీతమ్మధారలో సంక్రాంతి వేడుకల్లో కార్పొరేటర్ శ్రావణి

ప్రజాశక్తి -తగరపువలస : సంక్రాంతి పండుగ సందర్భంగా చిట్టివలస ఫ్రెండ్స్ హెల్పింగ్ హ్యాండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జ్యూట్ మిల్లు రోడ్డు, సత్య సాయి మందిరం సమీపంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు, ఫ్యాషన్ షో, వెస్టన్ డ్యాన్స్ తదితర పోటీల్లో విజేతలకు సోమవారం.పిఎసిఎస్ అధ్యక్షుడు అక్కరమాని రాము నాయుడు, గ్రామపెద్దలు ఆర్ సీతారామ దొర, మాజీ కౌన్సిలర్ పిట్టా సురేష్, జనసేన నేత పరిమి భువనేశ్వరి, వైసిపి నేతలు సిహెచ్ శివ బహుమతులు అందజేశారు కార్యక్రమంలో నిర్వాహకులు వి ప్రసాద్, రమేష్, నానాజీ పాల్గొన్నారు.

పిఎం పాలెం : మధురవాడ శిల్పారామంలో సంక్రాంతి సంబరాల ముగింపు దశలో కనుమ రోజున సోమవారం సాయంత్రం డాక్టర్ ఆడమ్స్ హాస్పిటల్ సహకారంతో జోష్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శాస్త్రీయ, జానపద కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బోగీ మంటలు, సంక్రాంతులు, హేమంత మంచులో సూర్యుడు, రంగుల పుట్టిల్లు, తెలుగు లోగిళ్ళు, నింగిలో హరివిల్లు, అరకు థింసా నాట్యం, వదినకు ఒకసారి, నోమి నోమన్నలార అంశాలను ప్రదర్శించారు. సంజన, సంధ్య, కుషాల్, మౌనిక, మన్విత, బషిత, వినిష, రిథమ్, చందు, మోహన కళాకారుల నృత్యాలు చేసి సందర్శకులను కనువిందు చేశాయి. శిల్పారామం పరిపాలన అధికారి టి. విశ్వనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

ఆనందపురం : తర్లువాడ ఎస్‌సి కాలనీలో చందల అప్పలరాజు ఆధ్వర్యంలో ముగ్గులు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. పిల్లలకు గాలిపటాలు అందించారు. మజ్జి శ్రీను, తత్రాజు అప్పలరాజు, కోరాడ కృష్ణారావు, చందల సూరిబాబు, కోండ్రు గణేష్, చందల శంకర, చందల ప్రవీణ్, పైల బుజ్జి, వరప్రసాద్, మామిడి సాయి పాల్గొన్నారు.

వెయ్యి మందికి దుస్తులు పంపిణీ

మధురవాడ : సంక్రాంతి సందర్భంగా నగరంపాలెం రోడ్డులోని శ్రీ వెంకటేశ్వర విద్యాపీఠ్ ఆధ్వర్యంలో ఏటూరి పైడిరాజు, పాఠశాల వ్యవస్థాపక ఛైర్మన్ యేబూరి వెంకటేశ్, డైరెక్టర్లు సంధ్య, వినయ్ వికాష్, ప్రణీత, పూసర్ల సాయికిషోర్, వెంకట సౌజన్యల ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. మధురవాడ పరిసర ప్రాంతాలకు చెందిన పేదలు, వికలాంగులు, వృద్ధులకు వెయ్యి మందికి చీరలు, పంచెలు, లుంగీలు, తువ్వాలు, దుప్పట్లు, రగ్గులు వంటివి పంచిపట్టారు.

గాజువాక : 75వ వార్డు దుర్గవానిపాలెం శివాలయంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకుని స్థానిక మహిళలకు ముగ్గుల పోటీలు విజేతలకు 74 వ వార్డు కార్పొరేటర్, వైసిపి సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ తిప్పల వంశీరెడ్డి బహుమతులు అందజేశారు. వార్డు ప్రజలందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయాభివృద్ధికి రూ. 50 వేల విరాళం

స్థానిక గౌరీపరమేశ్వర శివాలయ అభివృద్ధికి తిప్పల వంశీరెడ్డి రూ.50 వేల విరాళాన్ని గుడి కమిటీకి అందజేశారు. కమిటీ అధ్యక్షులు గంట్యాడ గురుమూర్తి, గంట్యాడ పైడిరాజు, ములకలపల్లి ప్రకాష్, ఎం వంశీ, గొల్లబిల్లి వెంకటరమణ, పి రాము, ఎం గురుమూర్తి, పి ఈశ్వరరావు, వై గోవింద, పి ప్రకాష్ పాల్గొన్నారు.

సీతమ్మధార : 26వ వార్డులో టిడిపి కార్పొరేటర్ ముక్క శ్రావణి ఆధ్వర్యంలో తెలుగువారి సంస్కృతి, సాంప్రదాయాలు కాపాడాలి అనే సంకల్పంతో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పల్లెటూరు వాతావరణం ప్రతిబింబించేలా గుడిసె, ఎద్దుల బండి, గడ్డి వాము, కొత్త ధాన్యం, వరి పంట, చెరకు గడలు, రంగులు వల్లులు, కొబ్బరి తోరణాలు, ధాన్యం పురెలు, రంగులు వల్లులు, కుండలు, గుమ్మడి కాయలు ఏర్పాటు చేశారు. టిడిపి వార్డు అధ్యక్షులు ముక్కా కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

సేవ్ వైజాగ్ స్టీల్ పేరుతో ఆటల పోటీలు

గాజువాక : పెదగంట్యాడ వెటర్నరీ ఆసుపత్రి ఆవరణలో సేవ్ వైజాగ్ స్టీల్ నినాదంతో విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పిల్లలకు స్లో సైకిల్ రైడ్, రన్నింగ్, మ్యూజికల్ చైర్, లెమన్ స్పూన్, నవ్వుల పోటీలు, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందించారు.కార్యక్రమంలో సిఐటియు స్టీల్ జోన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి నారాయణ మూర్తి కొవిరి అప్పలరాజు మాట్లాడుతూ గాజువాక ప్రాంత అభివృద్ధిలో కీలకమైన, రాష్ట్రంలోనే ఏకైక భారీ పరిశ్రమ, ప్రాణత్యాగాలతో సాధించుకున్న వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు అందరం సమిష్టిగా పోరాడుదామని పిలుపునిచ్చారు. సిఐటియు కాంట్రాక్టు లేబర్ యూనియన్ కార్యదర్శి నమ్మి రమణ, సిఐటియు నాయకులు కనితి అప్పలరాజు, లక్ష్మి, వెంకటలక్ష్మి, పాల వెంకయ్య, పేర్ల మసేను, ఉమ్మడి సోమేష్, సిహెచ్ రేణుక, పాల్గొన్నారు.

మ్యూజికల్ చైర్ ఆటల పోటీలో పాల్గొన్న బాలికలు

మానవ హక్కుల సంక్షేమ సమితి జిల్లా సహాయ కార్యదర్శిగా శివ

ప్రజాశక్తి అనందపురం: మానవ హక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శిగా ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ, కల్లివానిపాలెం కాలనీకి చెందిన దళాయి శివప్రసాద్ ఎల్లారావు ఎంపికయ్యారు. ఒఎన్‌జి ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న శివ సేవలను గుర్తించిన జాతీయ మానవ హక్కుల సంక్షేమ సమితి ఈ మేరకు బాధ్యతలను అప్పగించింది. దీనిపై శివ స్పందిస్తూ, మానవ హక్కుల సంక్షేమానికి, ప్రజలకు మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు.

ఓ పక్కకు పడేసి ఉన్న స్టాపర్లు

ప్రమాద ప్రాంతాల్లో స్టాపర్లు పెట్టరూ..

ప్రజాశక్తి -ములగాడ : పారిశ్రామిక ప్రాంతంలో కాన్వెంట్ జంక్షన్ నుంచి జింక్ గేటు వరకు ప్రధాన రహదారిలో పలు కూడళ్ళ వద్ద స్టాపర్లు అమర్చకపోవడంతో పాదచారులు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఉన్న స్టాపర్లను రోడ్డు ప్రక్కకు పెట్టేసి వదిలేయడంతో వాటిని వివిధ కార్యకలాపాలకు వాడుకుంటున్నారు. స్టాపర్లు లేకపోవడం వల్ల ఆయా జంక్షన్లో వద్ద వాహనాలు మితిమీరిన వేగంతో వచ్చి మలుపు తిరగడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో ట్రాఫిక్ సిబ్బంది ఉదయాన్నే విధులకు రాగానే ఆయా జంక్షన్ల వద్ద స్టాపర్‌ను అమర్చి తిరిగి రాత్రి సమయంలో విధులు ముగించేటప్పుడు రోడ్డుకు పక్కన పెట్టేవారు. సింధియా రహదారి దలంతా రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను తొలగించడం వల్ల వాహనదారుల మితిమీరిన వేగంతో ప్రయాణాలు చేయడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి గతంలో మాదిరిగా స్టాపర్లను ఆయా జంక్షన్లో వద్ద ఏర్పాటు చేయగలరని వాహనదారులు, పాదచారులు కోరుతున్నారు.

గిట్టుబాటు ధర లేక వెతలు

సంతకు తీసుకొచ్చిన గిరిజన ఉత్పత్తులు

ప్రజాశక్తి- పెదబయలురూరల్ :పెదబయలు వారపు సంతలో గిరిజనులు పండించిన రాజ్‌మా చిక్కులు, కాఫీ గింజలు, ఔషధ గుణాలు కలిగిన పిప్పల మోడీ వంటి పంటలకు గిట్టుబాటు ధర లేక గిరిజనులు వాపోయారు.గతవారం పిప్పల మోడీ ధర రూ.350 ఉండగా, ఈ వారం రూ.300లకు పడిపోయింది. రెండో రకం (మోడీ) నలక గత వారం రూ.75 ఉండగా ఈ వారం రూ.45, కాఫీ రూ.280 నుంచి 270లకు కొనుగోలు చేశారు. దళారీ వ్యాపారులు ఇష్టారాజ్యంతో గిట్టుబాటు ధరలు లభించలేదని, కనీస ధరలు కల్పించాలని గిరిజనులు ఆవేదన వక్తం చేశారు.

ఇంటింటికీ రేషన్‌పై హర్షం

చిన బొడ్డేపల్లిలో రేషన్ తీసుకుంటున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి - కోటవురట్ల : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటింటికి రేషన్ పథకం ద్వారా ప్రధానంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు రేషన్ సరుకులు అందుతుండంతో వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు, గతంలో నిర్ణీత సమయంలో రేషన్ దుకాణాలలో సరుకులు విక్రయించేవారు, దీంతో ప్రధానంగా చిన్న బొడ్డేపల్లి శివారు ప్రాంత ప్రజలు అవస్థలు పడే వారు. దాదాపు 8 కిలోమీటర్ల నడిచి వచ్చి సరుకులు విడిపించుకునే వారమని తెలిపారు. ఇంటి వద్దకే రేషన్ పథకాన్ని ప్రవేశపెట్టిన తొలిరోజుల్లో కాస్త ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, ప్రస్తుతం గ్రామీణ ప్రాంత ప్రజలకు వాహనదారులు అందుబాటులో ఉండే సమయం కేటాయించి, సరుకులు అందజేయడం పట్ల పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు,

వడ్లపూడి రైల్వే వంతెనకు మోక్షమెప్పుడో?

ప్రజాశక్తి -గాజువాక

ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నప్పటికీ వడ్లపూడి రైల్వే గేటు వద్ద వంతెనకు మోక్షం కలగడంలేదు. ఈ వంతెన నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగానే ఉంది తప్ప ఒక అడుగు ముందుకు పడలేదు. ఏడాది క్రితం విజయసాయిరెడ్డి స్వయంగా పరిశీలించి, వీలైనంత తొందరలో వడ్లపూడి రైల్వే బ్రిడ్జి వినియోగంలో తెస్తామని హామీ ఇచ్చారు. కానీ నేటికీ పూర్తి కాలేదు. వాస్తవానికి రైల్వే శాఖ వాటాగా వంతెనను పూర్తిగా నిర్మాణం చేపట్టారు. మిగతాది రాష్ట్ర పరిధిలో ఉంది. దీన్ని రోడ్లు భవనాల శాఖ పూర్తి చేయాల్సి ఉంది. అప్పట్లో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వంగానీ, ప్రస్తుత వైసిపి ప్రభుత్వం గానీ ఈ వంతెనకు సంబంధించి ఒక పైసా కూడా కేటాయించలేదు. దీంతో రైల్వే అధికారులు నిర్మించిన వంతెన అసంపూర్తిగా ఉండిపోయింది. ఈ వంతెన నిర్మాణ కాకపోవడంతో 14 గ్రామాల ప్రజలు, ఉద్యోగస్తులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆటోనగర్‌లో పనిచేస్తున్న ఎక్కువ శాతం మంది కార్మికులు ఈ రహదారి గుండా ప్రయాణిస్తుంటారు. ప్రస్తుతం కూర్మన్నపాలెం నుంచి షీలానగర్ వరకు 11 సిగ్నల్ పాయింట్‌లో ఉండడం వల్ల ట్రాఫిక్ రద్దు ఎక్కువగా ఉంటుంది. సమయాభావం కలుగుతుండటంతో వైజాగ్ నుంచి వచ్చే స్టీల్ ప్లాంట్ ఉద్యోగస్తులు, అగనంపూడి, కూర్మన్నపాలెం, రాజీవ్‌నగర్, దువ్వాడ ఏరియాలో నివాసముంటున్న వారు విశాఖ వెళ్లేందుకు ఈ రహదారినే వినియోగిస్తున్నారు. ఇక్కడ గేటు గేటు పడితే అరగంట వరకు వేచి ఉండే పరిస్థితి దాపురిస్తోంది. ఉదయం, రాత్రి ఈ ఇబ్బందులు తప్పడం లేదు. ఇక్కడ వంతెన నిర్మాణం పూర్తయితే ప్రతి ఒక్కరికీ ప్రయాణం సులభతరం అవుతుందని స్థానిక ప్రజలు అభిప్రాయపడుతున్నారు. కానీ ఆ దిశగా పనులు జరగకపోవడంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఏళ్లు గడుస్తున్నా పట్టని పాలకులు

కేంద్ర ప్రభుత్వ వాటాగా నిర్మించిన రైల్వే వంతెన

గేటు వేయడంతో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

అధికారులతో చర్చించా...

వడ్లపూడి రైల్వే గేటు సమస్యపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా. రెండు రోజుల క్రితం విజయవాడలో పరిశ్రమల శాఖ అధికారులను కలిసి సమస్యను వివరించాను.

రఘు
ఐలా చైర్మన్

ముఖ్యమంత్రి దృష్టికి సమస్య

వడ్లపూడి రైల్వే వంతెన విషయాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో పనులు ప్రారంభించే అవకాశముంది.

తిప్పల నాగిరెడ్డి
ఎమ్మెల్యే గాజువాక

వినియోగంలోకి తేవాలి : సిఐటియు

వడ్లపూడి రైల్వే వంతెనను వినియోగం తేవాలని సిఐటియు నాయకులు ఎం.రాంబాబు కోరారు.. దీనిపై గతంలో సిపిఎం, సిఐటియు తరపున ఆందోళన చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

దుకాణ సముదాయం.. హామీకే పరిమితం

అదిగో ఇదిగో అంటూ తాత్సారం

ఆరు నెలల క్రితం కూలుస్తున్న దుకాణ సముదాయం (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి -భీమునిపట్నం

పురపాలక సంఘంగా ఉన్న కాలంలో స్థానిక గంట స్తంభం సమీపంలో దాదాపు 20 దుకాణాలను నిర్మించారు. అవి శిథిలావస్థకు చేరాయన్న కారణంతో సుమారు ఏడాది క్రితం దుకాణాల్లో ఉన్న వ్యాపారులను జివిఎంసి ఒకటో జోన్ అధికారులు ఖాళీ చేయించారు. సుమారు 6 నెలల క్రితం వాటిని కూల్చేశారు. ఆధునిక పద్ధతిలో దుకాణ సముదాయం నిర్మిస్తామంటూ ఇటీవల బదిలీపై అనకాపల్లి జోన్‌కు వెళ్ళిన జోనల్ కమిషనర్ వెంకటరమణ పలుమార్లు చెప్పిన విషయం విదితమే. శిథిలావస్థకు చేరిన దుకాణసముదాయాన్ని పరిశీలించిన అప్పటి జివిఎంసి కమిషనర్ లక్ష్మీ శ కూడా బహుళ సామాజిక దుకాణ సముదాయం నిర్మిస్తామని హామీ ఇచ్చారు కూడా. అధికారుల హామీ నేటికీ కార్య రూపం దాల్చ లేదు.

ప్రత్యామ్నాయం చూపకుండానే కూల్చేశారు

సుమారు 25-30 ఏళ్ల క్రితం పురపాలక సంఘం, వుడా సహకారంతో ఇక్కడ నిర్మించిన దుకాణ సముదాయం సుమారు 20 మంది చిరు వ్యాపారులకు ఉపాధి ఇచ్చేది.వివిధ వ్యాపారాలు చేసుకుని జీవించే వారు. తద్వారా అప్పటి పురపాలక సంఘానికి, ప్రస్తుత జివిఎంసికి కూడా ఆదాయం వచ్చేది. శిథిలావస్థకు చేరిన దుకాణ సముదాయం కూల్చివేతను స్వాగతించాల్సిందే. అదే సమయంలో ఆయా దుకాణాల్లో ఎంతోకాలంగా వివిధ దుకాణాలు నిర్వహించుకుని ఉపాధి పొందుతున్న చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపించి ఉంటే బాగుండేదని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

త్వరగా దుకాణ సముదాయం నిర్మించాలి

త్వరగా దుకాణ సముదాయం నిర్మించాలి. తద్వారా అటు జివిఎంసికి అద్దెల రూపంలో ఆదాయం వస్తుంది. ఇటు చిరు వ్యాపారులకు ఉపాధి ఉంటుంది. జివిఎంసి ఇంజినీరింగ్ అధికారులు వీలైనంత త్వరగా అంచనాలు రూపొందించి, ప్రతిపాదనలు తయారు చేయాలి.

గంటా నూక రాజు
టిడిపి రాష్ట్ర కార్యదర్శి

పరిశీలించిన మీదట ప్రతిపాదనలు

కూల్చేసిన దుకాణ సముదాయం స్థలం పరిశీలించాక, ఇంజినీరింగ్ అధికారులతో అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు రూపొందించనున్నాం. వీలైనంత త్వరగా కొత్త దుకాణ సముదాయం నిర్మించేలా ప్రయత్నం చేస్తాం

బొడ్డేపల్లి రాము
జోనల్ కమిషనర్
జివిఎంసి, ఒకటో జోన్
భీమునిపట్నం

చేదెక్కిన చెరుకు

★ గిట్టుబాటు కాని వైనం

★ పంటకు దూరమవుతున్న రైతులు

ప్రజాశక్తి- చోడవరం

ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రధాన వ్యాపార పంటగా ఉన్న చెరుకు సాగుకు రైతులు దూరమవుతున్నారు. గతంలో గోవాడ, ఏటికొప్పాక, తుమ్మపాల, తాండవ సుగర్ ఫ్యాక్టరీల్లో ఏడాదికి సుమారు 11,50,000 టన్నులు చెరుకు క్రషింగ్ జరిగేది. ప్రస్తుతం గోవాడ మినహా మిగిలిన మూడు ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. ఆయా ఫ్యాక్టరీలు పరిధిలో చెరుకు సాగు చేసే రైతులు గిట్టుబాటు కాకపోవడంతో పంటకు దూరమయ్యారు. గోవాడ కర్మాగారం పరిధిలో రైతులు గతంలో ఐదు లక్షల 50 వేల టన్నులు చెరుకు ఫ్యాక్టరీకి సరఫరా చేసేవారు. గత నాలుగైదు ఏళ్లలో ఆ సంఖ్య మూడు లక్షలకు పడిపోయింది. గత ఏడాది రెండు లక్షల 85 వేల టన్నులు క్రషింగ్ జరిగింది. ఈ ఏడాది రెండు లక్షల టన్నులు పూర్తయ్యే పరిస్థితి కనబడలేదు. ఫ్యాక్టరీ పరిధిలో పెద్దేరు, కోణం, కళ్యాణపులోవ, తారకరామ రిజర్వాయర్ల ద్వారా పుష్కలంగా నీరు అందుతున్నా చెరుకు సాగు చేయడానికి రైతులు మొగ్గు చూపడం లేదు. ఎకరా చెరకు సాగుకు సుమారు రూ.60 వేలు ఖర్చు అవుతుంది. ఎకరాకు 20 నుండి 25 టన్నులు లోపు దిగుబడి వస్తోంది. చోడవరం సుగర్ ఫ్యాక్టరీ టన్నుకు రూ.2500తో పాటు తర్వాత మరో రూ.200 ఇస్తున్నారు. అది కూడా సకాలంలో ఇవ్వకపోవడంతో ఫ్యాక్టరీకి చెరుకు సరఫరా చేసేందుకు రైతులు వెనుకడుగు వేస్తున్న పరిస్థితి దాపురించింది. సుమారుగా టన్నుకు రూ.3,500 చెల్లిస్తే తప్ప గిట్టుబాటు కాదని రైతులు, రైతు సంఘాల నాయకులు ఎప్పటినుండో చెబుతున్నారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు పంచదార ఫ్యాక్టరీలను పట్టించుకోలేదని రైతులు అధిక సంఖ్యలో వైసిపికి ఓట్లు వేశారు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వం చెరుకు గిట్టుబాటు ధర అందించడంలో ఎటువంటి శ్రద్ధ చూపకపోవడంతో దిగాలు చెందిన రైతులు పంటకు స్వస్తి చెప్పి, అచ్యుతాపురం, పరవాడ ప్రాంతాల్లో ఉన్న కంపెనీలకు రోజు కూలీలుగా పనులకు వెళుతున్నారు.

బెల్లం ధర అంతే

దేశంలోనే రెండవ అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న అనకాపల్లి బెల్లం మార్కెట్ దినదిన గండం నూరేళ్ల ఆయుష్షుగా కొనసాగుతోంది. కేంద్ర ప్రభుత్వం గిట్టుబాటు ధరపై ఏమాత్రం పట్టించుకోకపోవడంతో రోజుకు 30 నుండి 40 వేల దిమ్మలు దిగుమతయ్యే మార్కెట్లో ప్రస్తుతం కనీసం 5000 దిమ్మలు కూడా రావడం గగనమవుతుంది. ఫ్యాక్టరీలు గిట్టుబాటు ధర అందించలేని తరుణంలో రైతులు బెల్లం తయారీ వైపు మొగ్గు చూపేవారు. బెల్లానికి కూడా గిట్టుబాటు ధర లేకపోవడంతో తయారీదారులు డీలపడ్డారు. బెల్లం మార్కెట్ నుండి కొనుగోలు చేసిన బెల్లం ఒడిశా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకు ఎగుమతి అవుతుండేది. ప్రస్తుతం ఆయా రాష్ట్రాలకు మహారాష్ట్ర, కర్ణాటక నుండి బెల్లం ఎగుమతి అవుతుండడంతో అనకాపల్లి మార్కెట్‌కు కొనుగోలుదారులు రావడం తగ్గడంతో లావాదేవీలు స్తంభించాయని వ్యాపారులు అంటున్నారు. సంక్రాంతి సీజన్ ముందు బెల్లం తయారీదారులు నాలుగు కాసులు కళ్ళ చూసేవారు.

బెల్లం తయారీలో మునగపాక, అనకాపల్లి, చోడవరం, బుచ్చయ్యపేట, మాడుగుల, చీడికాడ, రావికమతం మండలాలు ప్రసిద్ధి. ఈ ప్రాంతాల్లో ఎక్కడబడితే అక్కడ బెల్లం క్రషర్లు దర్శనమిచ్చేవి. ప్రస్తుతం ఎక్కడా తయారీ కనబడలేదు. ఇదే వరవడి మరో రెండు మూడు ఏళ్ళు కొనసాగితే పూర్తిగా చెరుకు సాగు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు. ప్రధాన వ్యాపార పంటగా ఉన్న చెరుకును గిట్టుబాటు ధర కల్పించి రైతులను మళ్లీ సాగు వైపు వెళ్లే విధంగా ప్రభుత్వాలు ప్రోత్సహించాలని రైతుల కోరుతున్నారు.

మాడుగుల టిడిపిలో సమసిపోని గ్రూపులు

ప్రకటనలకే పరిమితమైన ఐక్యతారాగం - కేడర్‌లో అయోమయం

ప్రజాశక్తి- కె.కోటపాడు

మాడుగుల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీలో గ్రూపుల గోల సమసిపోలేదు. పార్టీ నియోజకవర్గం పరిశీలకులు లొడగల కృష్ణ సమక్షంలో తామంతా ఐక్యంగా పని చేస్తామని ముగ్గురు ముఖ్య నాయకులు ప్రకటించినా, ఆచరణలో ఎక్కడా కానరావడం లేదు. వీరి వైఖరి పైకి పొత్తులు... లోపల కత్తులు అన్నట్లుగానే ఉంది తప్ప, పార్టీ మనుగడ కోసం తమ విభేదాలను పక్కన పెట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో నియోజకవర్గంలోని టిడిపి కేడర్‌లో అయోమయం నెలకొంది.

మాడుగుల నియోజకవర్గం టిడిపిలో ప్రస్తుత పార్టీ ఇన్‌ఛార్జి పివిజి.కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు కేంద్రాలుగా గ్రూపులున్నాయి. గ్రామస్థాయి వరకు ఈ మూడు గ్రూపులుగా పార్టీ కేడర్ విడిపోయి ఉంది. నియోజకవర్గంలో టిడిపికి మొదటి నుంచి బలం ఉన్నప్పటికీ గ్రూపులు, అసమ్మతి వల్లే గత రెండు పర్యాయాలు పార్టీ ఓడిపోయింది. గతంలో నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు మొత్తం కేడర్‌ను సమన్వయ పరిచి ఏకతాటిపై నడిపించడంలో విఫలమయ్యారని, దీంతో అసమ్మతి వర్గం ఏర్పడిందని, ఇది పార్టీకి నష్టం చేకూర్చుతుందని భావించిన అధిష్టానం ఆయన్ను ఆ పదవి నుంచి తప్పించింది. ఆ స్థానంలో పివిజి.కుమార్‌ను నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా నియమించినా గ్రూపులు తగ్గలేదు.

ఈ నేపథ్యంలో కొంత కాలం క్రితం టిడిపి నియోజకవర్గం పరిశీలకులు లొడగల కృష్ణ జోక్యం చేసుకొని మండలాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి, ముగ్గురు నాయకులను ఆ వేదికలపైకి తీసుకొచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పని చేయాలని సూచించారు. ఈ సందర్భంలో కొంతమంది మండల నాయకులు నియోజకవర్గం ఇన్‌ఛార్జి కుమార్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, మండల నాయకులను పట్టించుకోవడం లేదని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ టికెట్ ఎవరికిచ్చినా పార్టీ గెలుపే లక్ష్యంగా ఐక్యంగా పని చేస్తామని ఆ వేదికలపై లొడగల కృష్ణ సమక్షంలో ముగ్గురు నాయకులు ప్రకటించారు.

ఈ ప్రకటన మూడు నాళ్ళ ముచ్చటే. నియోజకవర్గంలో ముఖ్య నాయకులు ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాల్లో ఇది స్పష్టంగా కనిపించింది. ఒక రోజున ఒకచోట ఈ కార్యక్రమాన్ని రామానాయుడు చేపట్టగా, మరో చోట కుమార్ చేస్తూ పార్టీ కార్యకర్తలను విస్మయానికి గురి చేస్తున్నారు. నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిజి.కుమార్, సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు కొద్ది మేరకు కలిసి ఈ కార్యక్రమం చేస్తున్నా, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు మాత్రం విడిగా తన అనుయాయులతో కలిసి నిర్వహిస్తున్నారు. కలిసి చేద్దామని ఇటీవల దేవరాపల్లి మండలంలో కుమార్ సూచించినప్పటికీ అందుకు రామానాయుడు నిరాకరించారు. కుమార్ మెతక వైఖరితో నాయకులను ఒక తాటిపైకి తీసుకురావడంలో విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మరో వైపు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లోనూ నిర్వహిస్తూ ప్రజలకు మరింత దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఇప్పటికైనా టిడిపి నాయకుల్లో ఐక్యత లేకపోతే వచ్చే ఎన్నికల్లో మాడుగుల నియోజకవర్గంలో టిడిపి ఓటమి ఖాయమని ఆ పార్టీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ముగ్గురిలో ఎవరికి టికెట్ ఇచ్చినా మిగిలిన ఇద్దరూ గెలుపునకు కృషి చేస్తామని వారు చేసిన ప్రకటనను సైతం ప్రజలు నమ్మే పరిస్థితి లేకుండా పోయింది. ఈ ముగ్గురు నాయకులను తెలుగుదేశం పార్టీ అధినాయకులు పిలిపించి సఖ్యత తీసుకొస్తే తప్ప నియోజకవర్గంలో టిడిపికి పూర్వవైభవం రాదని ఆ పార్టీ కార్యకర్తలు చెబుతున్నారు.

నత్తనడకన జగనన్న ఇళ్ల నిర్మాణం

- ఖాళీ స్థలాల్లో సైతం పనులు జరుగుతున్నట్లు జియో ట్యాగింగ్
- ప్రభుత్వం ఇస్తున్న డబ్బులు లేబర్ ఛార్జీలకు కూడా సరిపోని వైనం

పూర్తిగా నిర్మాణాలు ప్రారంభం కాని కందిపూడి లేవుట్

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట

మండలంలో జగనన్న కాలనీల నిర్మాణం నత్తనడకన సాగుతున్నాయి. లబ్ధిదారులే ఇళ్లు నిర్మించుకోవాలని నిబంధన, పెరిగిన ధరలతో ఇళ్ల నిర్మాణాలు ఎక్కడా పూర్తిస్థాయిలో జరగడం లేదు. ప్రభుత్వ లక్ష్యం ఘనంగానే ఉన్నా, దాని అమలు మాత్రం ఆమడ దూరంలో ఉంది. బుచ్చయ్యపేట మండలంలోని 35 గ్రామపంచాయతీల్లో 2,233 మంది లబ్ధిదారులను గ్రామసభల ద్వారా గుర్తించారు. వీరికి 35 గ్రామపంచాయతీల్లో లేవుట్లను గుర్తించి ఒక్కొక్క లబ్ధిదారునికి ఒకటిన్నర సెంట్లు స్థలాన్ని కేటాయించారు. కానీ ప్రభుత్వం ఆశించిన మేర నిర్మాణాలు సాగటం లేదు. ప్రభుత్వం ఇళ్లను నిర్మించి ఇస్తానని హామీ ఇవ్వడంతో చాలామంది లబ్ధిదారులు అందుకు ఆమోదం తెలిపారు. కాని ప్రభుత్వం ఆ నిర్ణయం నుండి వెనక్కి వెళ్లి, ఒక్కొక్క ఇంటికి లక్షా 80 వేల రూపాయలు చొప్పున మంజూరు చేస్తోంది. ఈ నగదు ఇంటి నిర్మాణానికి ఏమాత్రమూ సరిపోవటం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇసుక, సిమెంటు, ఇటుక, ఇనుము తదితర నిర్మాణ ముడి సరుకులు ధరల విపరీతంగా పెరిగిపోవడంతో ఇంటి నిర్మాణం లబ్ధిదారులకు తలకు మించిన భారంగా మారింది. దీంతో చాలామంది లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను చేయడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఇస్తుంది రూ.1,80,000 కాగా, ఇంటి నిర్మాణానికి రూ.5 నుంచి రూ.6 లక్షల వరకు ఖర్చు అవుతుందని లబ్ధిదారులు చెబుతున్నారు.

ప్రభుత్వం ఇచ్చేది రూ.1.80లక్షలు.. మేస్త్రీలకు ఇస్తుంది రూ.2లక్షలు

ప్రస్తుతం నిర్మాణాలు ఎక్కువగా జరుగుతుండడంతో తాపీ మేస్త్రులకు డిమాండ్ అధికంగా ఉంది. దీంతో రోజువారీ పనులకు తాపీ మేస్త్రీలు రావటం లేదని లబ్ధిదారులు అంటున్నారు. తాపీ మేస్త్రీలు ఒక్కో ఇంటికి రూ.2 లక్షల చొప్పున కాంట్రాక్ట్ నిర్ణయించుకొని ఇంటి నిర్మాణాలను చేపడుతున్నారు. మేస్త్రీ, లేబర్ పనులకు కాంట్రాక్టర్ తీసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వం ఇచ్చే రూ.1,80,000 తాపీ మేస్త్రీలకు కూడా సరిపోవటం లేదు.

కాలనీలో కానరాని సదుపాయాలు

జగనన్న కాలనీలో తాగునీరు, రోడ్లు, ఇతర సదుపాయాలు కల్పిస్తామని ప్రభుత్వం చెప్పింది. కాని ఏ కాలనీలోనూ తాగునీటి సదుపాయం లేదు. లేవుట్లలో బోరు తీసి మోటార్ బిగించి విడిచిపెట్టారు. రోడ్లు, మిగతా సదుపాయాలు జాడ కాన రాలేదు.

6 గ్రామాల్లో లేవుట్ల రద్దు?

మండలంలోని 35 లేవుట్లలో ఆరు గ్రామాల్లో లే అవుట్లు రద్దు కానున్నాయి. గ్రామాలకు దూరంగా, నివాసయోగ్యానికి అవకాశం లేకుండా లేవుట్లు ఉండటంతో పాటు శ్మశానాలకు దగ్గరగా ఉన్నాయి. ఈ కారణాలతో ఐతంపూడి, పొట్టి దొరపాలెం, ఎల్‌బిపి అగ్రహారం, నీలకంఠాపురం, కరక గ్రామాల్లో మంజూరు చేసిన లేవట్లతో ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. దీంతో ఈ లేవుట్లను రద్దు చేయాలని అధికారులు ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం.

కాగితాల్లోనే నిర్మాణాలు?

మండలంలో జగనన్న కాలనీల ఇంటి నిర్మాణాలు కాగితాలకే పరిమితమయ్యాయి. లక్ష్యం నిర్మాణాల్లో కాకుండా కాగితాల్లోనే కనిపిస్తోంది. ఉన్నత స్థాయి అధికారులు లక్ష్యాలను నిర్దేశించి నిర్మాణాలు చేపట్టాలని ఒత్తిడి తేవడంతో నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారుల స్థలాల్లో సైతం నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు జియో ట్యాగింగ్ చేసి కాగితాల్లో చూపిస్తున్నారు. మండలంలో 2,233 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటికే 2,220 నిర్మాణాలు జరుగుతున్నట్లు ప్రభుత్వ వెబ్ సైట్‌లో చూపిస్తోంది. వాస్తవానికి ఏ లేవుట్‌లోనూ పూర్తిస్థాయిలో నిర్మాణాలు ప్రారంభం కాలేదు. మండలంలో 900 వరకు ఇళ్లు నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. 50 శాతం కూడా పూర్తి కాలేదు. మండలంలోని దిబ్బిడి గ్రామంలో 62 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేస్తే సుమారు 15 వరకు ఇళ్ల స్లాబులు పూర్తయ్యాయి. మరో 15 ఇళ్లు వివిధ దశల్లో పునాది, సన్‌సైడ్, స్లాబ్ లెవెల్ తదితర దశల్లో ఉన్నాయి. ఇంకా సగం ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాలేదు. కండిపూడిలో 62 ఇళ్లు మంజూరు కాగా, కేవలం 10 ఇళ్లు మాత్రమే నిర్మాణాలు జరుగుతున్నాయి. అందులో ఒకటి స్లాబ్ అవగా, మిగిలిన 9 సన్‌సైడ్, పునాది లెవెల్‌లో ఉన్నాయి. ఇంటి నిర్మాణాలు చేయకపోతే రద్దు చేస్తామని అధికారులు ఒత్తిడి తేవడంతో కొంతమంది పునాది పూర్తి చేసి చేతిలో డబ్బులు లేక నిర్మాణాలు ఆపేశారు. ఏది ఏమైనా ప్రభుత్వం ఇచ్చే నగదు ఇంటి నిర్మాణాలకు ఏమాత్రం సరిపోక జగనన్న కాలనీలో నిర్మాణాలు ఆశించిన స్థాయిలో జరగటం లేదు.

అరకొరగా నిర్మాణాలు జరుగుతున్న దిబ్బిడి లేవుట్

78వ రోజుకు నాబ్ నిర్వాసితుల దీక్షలు

దీక్షల్లో పాల్గొన్న నాబ్ నిర్వాసితులు

ప్రజాశక్తి- రాంబిల్లి :తమ సమస్యల పరిష్కారానిని నాబ్ మెయిన్ గేటు ముందు నిర్వాసిత మత్స్యకారులు చేపడుతున్న దీక్షలు సోమవారానికి 78వ రోజుకు చేరుకున్నాయి. సంక్రాంతి పెద్దపండుగకు సైతం నిర్వాసిత మత్స్యకారులు దీక్ష శిబిరంలో ఉండి ఆందోళన చేసే పరిస్థితులు కల్పించిన ప్రభుత్వం, అధికారులు ఇప్పటికైనా దిగొచ్చి తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎనిమిది గ్రామాల నిర్వాసితులు ఆందోళనలో పాల్గొన్నారు.

గాలిలో ప్రజల ప్రాణాలు!

- బిఎన్ రోడ్డులో వరుసగా ప్రమాదాలు
- కల్వర్టు పనుల వద్ద కానరాని హెచ్చరిక బోర్డులు
- పట్టించుకోని కాంట్రాక్టర్, ఆర్అండ్బి అధికారులు

హెచ్చరిక బోర్డు లేని నిర్మాణంలో ఉన్న కల్వర్టు

కల్వర్టు గోతిలోంచి క్షతగాత్రుడిని తీస్తున్న వాహనదారులు

ప్రజాశక్తి- కొత్తకోట:;మునిపట్నం - నర్సీపట్నం రహదారిలో కల్వర్టు నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్, ఆర్అండ్బి శాఖ అధికారులు అలసత్వం కారణంగా ఓ నిండు ప్రాణం గాలిలో కలిసి పోయింది. కల్వర్టు నిర్మాణ ప్రదేశాలలో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయక పోవడంతో ప్రమాదవ శాత్తు బైక్ అదుపు తప్పి కల్వర్టు గోతిలో పడి వ్యక్తి దుర్మణం చెందాడు. వారం రోజుల కిందట గోకివాడ గ్రామానికి చెందిన భార్య భర్తలు ఇదే రహదారిలోని నిర్మాణంలో ఉన్న కల్వర్టులో పడి తీవ్రంగా గాయపడిన సంఘటన మరవకు ముందే మరో సంఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదాలపై ఈనెల 12న ప్రజాశక్తి వార్తా కథనంలో హెచ్చరించినప్పటికీ ఆర్అండ్బి శాఖ, కాంట్రాక్టర్లో మార్పు రాకపోవడం మరో నిండు ప్రాణం పోయింది. ఈ సంఘటనకు సంబంధించి కొత్తకోట పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోటవురట్ల గ్రామానికి చెందిన గట్టి వీర రాఘవులు (53) ఆదివారం రాత్రి 7.30 సమయంలో రావికమతంలో బంధువుల ఇంటికి బైక్ పై వెళ్తుండగా టి.అర్జాపురం గ్రామ సమీపంలో ఇటుకుల బట్టి వద్ద నిర్మాణంలో కల్వర్టులో ప్రమాదవ శాత్తు అదుపు తప్పి బోల్తా పడ్డాడు. దీంతో రాఘవులు తీవ్రంగా గాయపడి స్పృహ కోల్పోయాడు. ఇది గమనించిన వాహన దారులు సపర్యలు చేసి 108 వాహనం ద్వారా నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఈ సంఘటన పై మృతిని బంధువు దేవర శెట్టి కాళీ ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తకోట హెచ్సి గోవిందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హామీల అమలులో మోసం

ప్రజాశక్తి- కె.కోటపాడు : రైతులను అన్ని విధాలుగా ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి మోసం చేశారని సిపిఎం. మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు, ప్రజా సంఘాల కన్వీనర్ ఎర్రదేవుడు విమర్శించారు. సోమవారంవిలేకరులతో మాట్లాడుతూ రైతు భరోసా పథకంలో ఏడాదికి రూ.12500 ఇస్తామని ప్రకటించి రూ.7,500కు కుదించారన్నారు. ప్రత్నామ్నాయ పంటలకు చేయూత, పంటలకుగిట్టుబాటు ధర కల్పిస్తామన్న ఎన్నికల ముందు హామీలు అమలు చేయలేదన్నారు ఆక్వా రైతులకు సబ్సిడీ విద్యుత్తు హామీకూడా అటకెక్కించేశారన్నారు. వైఎస్ఆర్ జలకళ ప్రచారానికి పరిమితమైందని, పూర్తిస్థాయి ప్రయోజనం రైతులకు అందడం లేదన్నారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర, మార్కెటింగ్ సదుపాయాల కల్పనపై ఇచ్చిన మాటను సైతం సిఎం జగన్ నిలబెట్టుకోలేదని విమర్శించారు.

వందే భారత్ రైలుకు ఎంపీ స్వాగతం

ప్రజాశక్తి -అనకాపల్లి : వందేభారత్ రైలుకు అనకాపల్లిలో ఎంపీ డాక్టర్ బివి సత్యవతి విష్ణుమూర్తి స్వాగతం పలికారు. విశాఖ నుంచి హైదరాబాదుకు కేవలం ఎనిమిది గంటల్లోనే చేరుకునేలా రైలు సదుపాయం కల్పించిన ప్రధాని మోడీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా డిఆర్ఎం అనూప్ కుమార్తో కలిసి విశాఖపట్నం ట్రైన్లో ప్రయాణించారు. డిఆర్యుసిసి సభ్యులు బొడ్డు శ్రీరామ్మూర్తి, శ్రీనాథ శ్రీనివాసరావు, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

పాడిరైతులకు బోనస్ పంపిణీ

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలోని రాజాంలో హెరిటేజ్ పాలకేంద్రానికి పాలు సరఫరా చేస్తున్న రైతులకు హెరిటేజ్ సంస్థ సంక్రాంతి బోనస్గా రూ. 70వేలు అందజేసింది వెంకన్నపాలెం ప్లాంటు మేనేజర్ ఎస్.వరహాలుబాబు సభ్యరైతులకుఅందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వెంకన్నపాలెం పరిధిలో 60 పాలకేంద్రాలకు రూ.35 లక్షల బోనస్ మంజూరైందన్నారు. సభ్యరైతులకు ఏడాదికి రెండుసార్లు బోనస్ అందజేస్తున్నామన్నారు. సహజంగా మరణించిన ముగ్గురు సభ్యరైతులు మజ్జి సత్యవతి ,సేనాపతి రాము, శిరిపల్లి హరిబాబు కుటుంబాలకు రూ.50వేలు చొప్పున బీమా పరిహారం అందజేశారు. డెయిరీ సిబ్బంది జి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి- కె. కోటపాడు : ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన, గాయపడిన బాధితుల కుటుంబాలకు పైడంపేట గ్రామస్తులు ఐకమత్యంగా ఆర్థికసాయం అందించి, అండగా నిలిచారు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రొంగలి మహేష్ తెలిపిన వివరాలివి. ఈ నెల 10న సీమలాపల్లి వద్ద జరిగిన ప్రమాదంలో పైడంపేట గ్రామానికి చెందిన కర్ణాటక సాయి మృతి చెందగా, పొట్నూరు లక్ష్మణ తీవ్ర గాయాల పాలయ్యాడు. బాధిత రెండు కుటుంబాలకు గ్రామస్తులు ఏకమై రూ.1,41,500 విరాళాలు సేకరించి, సర్పంచ్ రాఘవ నాయుడు, ఉపసర్పంచ్ రామునాయుడు ద్వారా బాధిత కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో కిలపర్తి గణేష్ కుమార్ , సిరికి రామనాయుడు, తెలుగు యువత నాయకులు రొంగలి ముత్యాలనాయుడు, బొద్ద మహాలక్ష్మినాయుడు, బేరా అప్పారావు, కిలాన శంకర్రావు పాల్గొన్నారు.

బుద్ధుని మార్గాలే ప్రపంచ శాంతికి సోపానాలు

బొజ్జన్న కొండ బౌద్ధమేళాలో పాల్గొన్న బౌద్ధ భిక్షవులు

ప్రజాశక్తి-అనకాపల్లి : బుద్ధుడు అందించిన శాంతి అహింస ధర్మ మార్గాలే ప్రపంచ శాంతికి శరణ్యమని మయన్మార్ బౌద్ధ భిక్షువు వెనరబుల్ ఆయుపాల మహాతేరో, అరుణాచల్ ప్రదేశ్ బౌద్ధ బిక్షవు ఘోషిత భాంతేజీ అన్నారు. సోమవారం ప్రముఖ బౌద్ధారామ క్షేత్రం బొజ్జన్న కొండ వద్ద బౌద్ధమేళాను పురస్కరించుకొని విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య, సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బొజ్జన్న కొండ నుంచి ప్రధాన గుహ వరకు బౌద్ధ పతాకాలను పట్టుకొని పంచశీల శాంతిర్యాలీ నిర్వహించారు. అనంతరం గుహలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా బౌద్ధ బిక్షవులు మాట్లాడారు. అతి పురాతన బౌద్ధారామక్షేత్రం బొజ్జన్న కొండను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులపై ఉందన్నారు. బౌద్ధ సంఘాల సమాఖ్య అధ్యక్షులు మాటూరి శ్రీనివాసరావు బొజ్జన్న కొండ ప్రాముఖ్యతను వివరించారు. సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చర్ అసోసియేషన్ వ్యవస్థాపకులు, బౌద్ధ సంఘాల సమాఖ్య ప్రచార కార్యదర్శి బల్ల నాగభూషణం మాట్లాడుతూ బొజ్జన్న కొండ అభివృద్ధికి మంజూరైననిధులు రూ.15 కోట్లతో తక్షణమే పనులు ప్రారంభించాలని కోరారు. బవిశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య ప్రచురించిన మనభూమి కేలండర్ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రధాన కార్యదర్శి బోరా వేణుగోపాల్ గౌతం, గొంది నవీన్, బొడ్డు కల్యాణరావు, పెయ్యిల సిద్ధార్థ, జెవి ఝాన్సీలక్ష్మి, బీర రత్నకుమారి, యుర్ల వెంకటరావు పాల్గొన్నారు.

బొజ్జన్న తీర్థానికి పోటెత్తిన జనం

ఏటా కనుమ పండుగరోజు నిర్వహించే బొజ్జన్న కొండ తీర్థానికి వేల సంఖ్యలో సందర్శకుల రాకతో బొజ్జన్న కొండ కిటకిటలాడింది. బొజ్జన్నకొండ వద్ద భారీ ఎత్తున దుకాణ సముదాయాలు, రంగురంగుల పంచదార చిలకలు, రంగుల రాట్నాలు, గాలిపటాల ఎగరవేత, బుద్ధుని దమ్మ సందేశ పుస్తక ప్రదర్శన, రకరకాల బొమ్మల దుకాణాలు ఆకట్టుకున్నాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సందర్శకుల తాకిడి నేపథ్యంలో పోలీసుల ట్రాఫిక్ ఆంక్షలతో కాలినడకనే బొజ్జన్న కొండకు సందర్శకులు చేరుకున్నారు.

బుద్ధుని విగ్రహావిష్కరణ

అనకాపల్లి : అనకాపల్లి చోడవరం రోడ్డులో బొజ్జన్నకొండకు వెళ్లే మార్గంలో బుద్ధుని విగ్రహాన్ని సోమవారం వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్కుమార్, సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, టిడిపి కోర్ కమిటీ సభ్యులు కొణతాల శ్రీనివాసరావు, ఎంపిటిసి చదరం నాగేశ్వరరావు, పంచదార్ల కన్నారావు, పన్నీరు వెంకటలక్ష్మి చంటి, అన్నపూర్ణ బ్యాంకు చైర్మన్ పిడి గాంధీ ఆవిష్కరించారు. జబర్దస్త్ సత్తిపండు, గొర్లి శ్రీనివాసరావు, కొణతాల నాయుడు, చదరం చిన్న, ఎర్రంశెట్టి రామారావు, తర్ర సత్యారావు పాల్గొన్నారు.

ఆరుగురికి కొణతాల స్మారక పురస్కారాలు

పురస్కారాల గ్రహీతలతో సిబిఐ మాజీ జెడి లక్ష్మినారాయణ

ప్రజాశక్తి-అనకాపల్లి : డాక్టర్ కొణతాల రామలింగస్వామి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ విభాగాల్లో సేవలందించిన పలువురికి పురస్కారాలను అందజేసింది. ఉప్పల చంద్రశేఖరరావు కల్యాణ మండపంలో ట్రస్ట్ చైర్మన్ కొణతాల లక్ష్మిపార్వతి తనయులు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కెఎన్వీఎస్ శంకర్బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని పురస్కారాలను అందజేశారు. అనంతరం ఒక రూపాయికే వైద్య సహాయం అందిస్తున్న హైదరాబాదుకుచెందిన దారా గంగాధర గుప్తా, రైల్లో మహిళకు పురుడు పోసిన గీతం కళాశాల వైద్యవిద్యార్థి డాక్టర్ కేసరి స్వాతిరెడ్డి, సాయానికి పది రూపాయలు సేవా సంస్థ వ్యవస్థాపకులు లాలం ఏసుబాబు, సేవాతత్పరతతో ఆర్థిక సహాయం చేసిన ఎస్ఐ జక్కుల నాగేశ్వరరావు, విద్యార్థుల భవిష్యత్తుకు అనేక కార్యక్రమాలు చేపట్టిన ఎర్ర చక్రవర్తి, చిన్నతనంలోనే 18 ప్రయోగాలు చేసి ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించిన రేజేటి శ్రీరామ్ స్వరూప్లను కొణతాల రామలింగస్వామి స్మారక అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఎఆర్ఎస్ విశ్రాంత శాస్త్రవేత్త కె.వీరభద్రుడు, రచయిత పేకేటి శ్రీనివాసరావు, కొణతాల ఉమామహేశ్వరరావు, కాండ్రేగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

చర్చికి పైలా విరాళం

విరాళం అందజేస్తున్న పైలా ప్రసాదరావు

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని తిమిరాంలోని సీయోను ప్రార్థనా మందిరానికి వాహనం సమకూర్చేందుకు తనవంతుగా మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు పైలా ప్రసాదరావు రూ.25 వేల విరాళంగా అందజేశారు.ఈ సందర్భంగా పైలాను సత్కరించారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్, రాష్ట్ర టిడిపి ఎస్సీ సెల్ నాయకులు చింతల సాంబమూర్తి, రాయపురెడ్డి ఈశ్వరరావు, రెడ్డి నాయుడు, ఎలిసెట్టి జగ్గారావు, గూరె నాయుడు, బోకం శ్రీరామ్మూర్తి, దేవరాపల్లి పైలా యువసేన అధ్యక్షుడు గట్రెడ్డి కొండలరావు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

ప్రజాశక్తి- దేవరాపల్లి : వైసిపి ప్రభుత్వ ప్రజా, రైతు వ్యతిరేక విధానాలపై పోరాడతామని మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్ఛార్జి పివిజి.కుమార్, సీనియర్ నేత పైలా ప్రసాదరావు అన్నారు. మండలంలోని మారేపల్లి గ్రామంలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి, రచ్చబండ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామంలో ర్యాలీగా ప్రధాన వీధుల్లో తిరుగుతూ, ప్రజా సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వంపై వ్యతిరేక నినాదాలు చేస్తూ, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు.కార్యక్రమంలో పోతల పాత్రునాయుడు, కర్రి సింహాద్రి నాయుడు, బండారు రామారావు, దోగ్గ,నాయుడు, తమడాన ప్రసాద్,దొర,కిల్లి గోవింద, గెట్రెడ్డి కొండలరావు (జీకే), చింత సాంబమూర్తి, రాయపురెడ్డి ఈశ్వరరావు, చల్లా నానాజీ పాల్గొన్నారు.

బిసి సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా మారేష్

ప్రజాశక్తి -అచ్యుతాపురం : బిసి సంక్షేమ సంఘం అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షులుగా పెంకె మారేష్ను నియమిస్తూ జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కష్ణయ్య నియామక పత్రాన్ని అందజేశారు. అచ్చుతాపురం మండలం గొర్లి ధర్మవరం పంచాయతీకి చెందిన మారేషు బిసిల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ఈస ందర్భంగా మారేష్ను పలువురు అభినందించారు.

ఉప ముఖ్యమంత్రిని కలిసిన వైసిపి నేతలు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడును సోమవారం మండలానికి చెందిన వైసిపి నేతలు కో కన్వీనర్ కారుకుండి గంగూలీ శ్రీను, పల్లి శేషగిరిరావు, గొర్రె గోవింద తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి సంక్రాంతి శు భాకాంక్షలు తెలిపారు.

వాడవాడలా సంక్రాంతి సంబరాలు

-పలు చోట్ల వివిధ రకాల పోటీలు

-విజేతలకు బహుమతుల ప్రదానం

అచ్యుతాపురంలో చిన్నారుల వేషధారణ

పలుగ్రామాల్లో సంక్రాంతి పోటీలను ఘనంగా నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎడ్లబళ్లు పరుగు, కబడ్డీ, ఇతర పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు.

ప్రజాశక్తి-రావికమతం:సంక్రాంతి సందర్భంగా కవగుంటలో ముగ్గుల పోటీల విజేతలకు సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు చేతల మీదుగా సోమవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, రాజన్న యూత్ సభ్యుల ఆర్థిక సహాయ సహకారాలతో ముగ్గుల పోటీలు నిర్వహించగా 23 మంది పాల్గొన్నారన్నారు. థింసా డాన్సులతో మహిళలు ప్రజలను ఉర్రూత లూగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, రాజన్న యూత్ సభ్యులు, గ్రామ ప్రజలు పలువురు పాల్గొన్నారు.

మాకవరపాలెం:మాకవరపాలెం గ్రామంలో రామాలయం వద్ద గత మూడు రోజులుగా సంక్రాంతి సంబరాలు ఘనంగా గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో నిర్వహించారు. భజనలు, చిడతలు, డాన్స్ వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భారీ సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలోని ఏఎల్‌పురం గ్రామం గొల్లపేటలో సంక్రాంతి సందర్భంగా కృష్ణ గణేష్ యూత్ ఆధ్వర్యంలో ముగ్గులు పోటీల నిర్వహించారు. ఈ పోటీల్లో 54 మంది మహిళలు పాల్గొన్నారు. గొలుగొండ ఎంపిపి గజ్జలపు మణికుమారి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో తప్పెటగుళ్లు, కోలాటం కార్యక్రమాలు నిర్వహించారు.

లింగంపేట గ్రామంలో యువతీ యువకులు, విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. టిడిపి ఆధ్వర్యంలో స్లో సైక్లింగ్, లెమన్ స్పూన్, క్విజ్, చిత్రలేఖనం తదితర పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు మంచి స్పందన లభించినట్లు టిడిపి నేత శ్రీకాంత్ తెలిపారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

కోటవురట్లలో బహుమతులు ఇస్తున్న జనార్థన్

కోటవురట్ల: మండలవ్యాప్తంగా పలు గ్రామాల్లో సంక్రాంతి సంబరాల్లో భాగంగా సంస్కతిక కార్యక్రమాలు నిర్వహించారు. కోటవురట్ల గ్రామంలో పెద్ద సంఖ్యలో మహిళలు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. పాములవాక గ్రామంలో టిడిపి నాయకులు జనార్ధన్, వైసిపి నాయకులు కిల్లాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు,

చీడికాడ: మండలంలోని సిరిజాం గ్రామంలో సంక్రాంతి వేడుకల్లో భాగంగా పైడితల్లమ్మ అమ్మవారి తీర్థ మహెూత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు పైలా ప్రసాదరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎడ్ల బళ్ల పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించిన విజేతకు పైలా తన వంతుగా రూ.8 వేలు బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పైలాతో పాటు మాజీ సర్పంచ్ పంచాడ దాలినాయుడు, గండి ముసిలి నాయుడు,స్వామి నాయుడు,కన్నూరు లక్ష్మి నాయుడు, కామిరెడ్డి ఎరుకు నాయుడు,చీడికాడ పైలా యువసేన అధ్యక్షుడు దొగ్గా బలరాం పాల్గొన్నారు.

మునగపాక రూరల్: మండలంలోని పాటిపల్లిలో మాజీ సర్పంచ్ ఆడారి అప్పలనాయుడు జ్ఞాపకార్థం స్పందించే హదయం చారిటబుల్ సంస్థ ఆధ్వర్యంలో సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహించారు. పిల్లలు చేసిన నత్యాలు, గీతాలు పలువురిని ఆకట్టుకున్నాయి. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గుడ్డ సంచులను పంపిణీ చేశారు. సర్పంచ్ ఆడారి కష్ణవేణి, నిర్వాహకులుఎస్ తమ్మి రాజు, ఆడారి రామ్మోహన్ రావు, కె,వి రమణ పాల్గొన్నారు.

మునగపాక రూరల్: సంక్రాంతి సంబరాలలో భాగంగా దాడి అప్పలనాయుడు పర్యవేక్షణలో స్థానిక బైపాస్ జంక్షన్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి ఎడ్ల బళ్ల పోటీలు మాజీ మంత్రి దాడి వీరభద్రరావు ప్రారంభించారు. అనకాపల్లి జిల్లా టిడిపి అధ్యక్షుడు బుద్ధ నాగ జగదీశ్వరరావు, జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి సుందరపు విజయ్ కుమార్, విద్యార్థి వెంకట్రావు బహుమతులను అందజేశారు.

స్థానిక సాయిబాబా ఆలయంలో తన తల్లి అచ్చయ్యమ్మ జ్ఞాపకార్థం సర్పంచ్ దిమ్మల అప్పారావు సొంత నిధులతో 300 మందికి పేదలకు, వద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు.స్థానిక నందీశ్వర కళాప్రాంగణం ఆవరణలో ప్రవాసమిత్ర ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు.

దేవరాపల్లి : మకర సంక్రాంతి పండగను పురస్కరించుకొని ప్రతి ఇంటి ముంగిట రంగురంగుల రంగవల్లులు కళకళలాడాయి. ముగ్గులు వేసేందుకు ఆడపిల్లలు ఆసక్తి చూపించారు.

అచ్యుతాపురం : తిమ్మరాజుపేటలో సర్పంచ్ సరగడం భాగ్యలక్ష్మి శివబాపునాయుడు, మణికంఠ యూత్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. తిమ్మరాజుపేట జంక్షన్‌లో గణేష్ యూత్ ఆధ్వర్యంలో స్లో సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. కొండకర్ల గ్రామంలో జిల్లాస్థాయి చెడుగుడు పోటీలను వైసిపి నేత అంజిరెడ్డి ప్రారంభించారు. తిమ్మరాజుపేట, జగ్గన్నపేటల్లో అన్నసమారాధన నిర్వహించారు.

వడ్డాదిలో పరుగు పెడుతున్న ఎడ్ల బళ్లు

బుచ్చయ్యపేట : మండలంలోని కొండెంపూడిలో జనసేన, టిడిపి యూత్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

వడ్డాది: సంక్రాంతిని పురస్కరించుకుని బంగారమెట్టలో శ్రీ అచ్చమ్మ పేరంటాలు తీర్థం నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఎడ్లబళ్ల పరుగుపందెం, పిడతల పోటీలు నిర్వహించారు విజేతలకు టిడిపి చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్య బాబు బహుమతులు అందజేశారు. స్థానిక నాయకులు సాయం రమేష్ సర్పంచ్ మెరుగు కుమారి బాబురావు ఎంపిటిసి ఎల్లపు జగ్గారావు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని ఆసకపల్లి గ్రామంలో బంగారమ్మ అమ్మవారి సన్నిధిలో పిఎసిఎస్ చైర్మన్ కాపుశెట్టి శేషుబాబు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలలో భాగంగా ముగ్గులు పోటీలు నిర్వహించారు. 90 మంది మహిళలు పాల్గొనగా, విజేతలకు బహుమతులు అందజేశారు.ఉప సర్పంచ్ కరణం సురేష్, ధూళి నరేష్, కరణం రమణ, నక్క అప్పారావు, దువ్వ దుర్గాలు, రౌతు కిరణ్, బొండా పాండు పాల్గొన్నారు.

ఘనంగా గజేంద్రమోక్షోత్సవం

సింహాచలం: సింహాచల దేవస్థానంలో గజేంద్రమోత్సవ ఉత్సవాన్ని దేవస్థానం అర్చకులు, అధికారులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవం సందర్భంగా స్వామివారిని వేకువజామున మేల్కొల్పి పలు ఆరాధన సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం మెట్ల మార్గం గుండా తొలి పావంచ వద్దకు రాగా వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం, దేవస్థానం అధికారులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని పుష్కరిణి సత్రానికి తీసుకెళ్లి గజేంద్ర వాహనంపై తిరు వీధి ఉత్సవాన్ని నిర్వహించారు. మెట్ల మార్గం గుండా సింహగిరికి చేర్చడంతో ఉత్సవం ముగిసింది.

ములగాడ: పారిశ్రామిక ప్రాంతం 62వ వార్డు దుర్గ నగర్‌లో వార్డు అధ్యక్షులు మజ్జి మాలినాయుడు ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను వైభవంగా నిర్వహించారు. పల్లెను తలపించేలా పల్లె వాతావరణన్ని ఏర్పాటు చేశారు.. ఈ కార్యక్రమంలోని స్థానిక మహిళలు, పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

పూరిల్లు దగ్ధం

-కాలిబూడిదైన సామగ్రి

-ఆదుకోవాలని బాధితుల వినతి

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని ఏటిగైరంపేట వద్ద చటర్జీపురంలో మురుకుటి అప్పలనాయుడు ఇల్లు దగ్ధమైంది. దీంతో కూలి పనులు చేసి దాచుకున్న డబ్బులు, బట్టలు, వస్తువులు, బియ్యం, పప్పులు కాలి పోవడంతో కట్టుబట్టలతో మిగిలారు. పేద కుటుంబాలు కావడంతో పూర్తిగా ఆశ్రయం కోల్పోయి రోధిస్తున్నారు. దాతలు కరుణించి సహాయం చేయాలని బాధితుడు కోరుతున్నాడు. పూరింటికి నిప్పుపెట్టిన వారిని శిక్షించి, తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

సరుకులు ఇస్తున్న దాత

పేదలకు సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని బుచ్చెంపేట గ్రామంలో సుమారు 30 నిరుపేద కుటుంబాలకు 15 రకాల నిత్యావసర వస్తువులను సంక్షేమ అభివృద్ధి కార్యదర్శి అనిమిరెడ్డి రమణ ఆర్థిక సహాయంతో యువకులు పంపిణీ చేశారు. ఆయన ఇది వరకే ఎన్నో సేవా కార్యక్రమాల్లో తన మానవత్వాన్ని కనబరిచారు. భవిష్యత్తులో కూడా తనకు తోచినంత వరకు ప్రజలకు సహాయ, సహకారాలు అందించటానికి తానేప్పుడూ సిద్దంగా ఉంటానని ఆయన చెప్పారు. రమణను పలువురు అభినందించారు.

వెండి దండ వితరణ

ప్రజాశక్తి-నర్సీపట్నం రూరల్::పట్టణంలోని శ్రీబాల వినాయక స్వామి దేవస్థానంకు కొత్తూరు హానిష్, మీనాక్షి దంపతులు సుమారు 11వేల విలువ గల వెండి దండను ఆలయ చైర్‌పర్సన్ దేవత అరుణ, అర్చకులు ఐ.గణేష స్వామి ఆధ్వర్యంలో అందజేశారు. ఈ దండను స్వామి వారికి విశేష అలంకరణ చేసే రోజులలో ఉపయోగించాలని కోరారు.

కోడి పందేల శిబిరాలపై దాడి

-నగదు, కోడి పుంజులు స్వాధీనం

-పట్టుబడ్డ పలువురు నిందితులు

-కేసులు నమోదు చేసిన పోలీసులు

ప్రజాశక్తి-మాకవరపాలెం: మండలంలో రామన్నపాలెం గ్రామంలో బహిరంగ ప్రదేశాల్లో కోడిపందాలు జరుగుతున్నట్లు విశ్వాసనీయ సమాచారం అందుకున్న ఎస్ఐ. రామకృష్ణ తన సిబ్బందితో సోమవారం దాడి చేశారు. నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. వారి నుండి రూ.1450 నగదు, మూడు కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

గొలుగొండ:మండలంలోని గుండుపాల కొత్తూరు గ్రామలో కోడి పందాల శిబిరంపై ఎస్సై నారాయణరావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. నిర్వహిస్తున్న నిర్వాహకులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

ఎస్.రాయవరం:మండలంలో కోడిపందాలు జరుగుతున్న ప్రాంతాలలో దాడులు జరిపి ఆరుగురుని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. సోమవారం ఉదయం వమ్మవరం గ్రామంలో కోడిపందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేయగా నలుగురు వ్యక్తులు, ఏడు కోళ్ళు, ఆరువందల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. దార్లపూడి గ్రామంలో కోడిపందాలపై దాడి చేయగా ఇద్దరు వ్యక్తులు, ఏడు కోడిపుంజులు, పది హేడు వందల పట్టుబడిందన్నారు. ఎస్.రాయవరం గ్రామ శివారులో మామిడితోటలో ఐదుగురిని పట్టుకుని, వారి వద్ద నుండి 12 కోడిపుంజులు, 3500 స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మాకవరపాలెం మండలంలో దాడి చేసిన శిబిరం వద్ద పోలీసులు

అక్రమంగా గ్రావెల్, మట్టి తరలింపు

-కరిగి పోతున్న కొండలు - పట్టించుకోలేని అధికారులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం ప్రాంతంలోని జోగునాధునిపాలెం, మెట్టపాలెం ప్రాంతాలలో గ్రావెల్, మట్టి అక్రమంగా రవాణా సాగుతోంది. అధికార పార్టీ నాయకుడు, ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు గ్రావెల్ రవాణాకు పాల్పడుతున్నారు. జోగునాధునిపాలెం కొండను పూర్తిగా తవ్వేస్తున్నారు.ఇటీవల ముఖ్యమంత్రి సభకు గ్రావెల్ రవాణా పేరుతో పక్కదారి పట్టించి అదను చూసి రోజుకు 50 నుండి 100 ట్రాక్టర్ల రవాణా చేశారు.ఇంత జరుగుతున్న అధికారులు పట్టించుకోలేదు. పండగ సందర్భంగా ఎవరు లేని సమయాన్ని చూసి సందట్లో సడే మీయగా రవాణా చేపడుతున్నారు.

నర్సీపట్నం డివిజన్ గ్రావెల్ అక్రమ రవాణాకు నిలయంగా మారింది. మాకవరపాలెం, కోటవురట్ల, నాతవరం, గొలుగొండ మండలాల్లో విపరీతంగా మట్టి, గ్రావెల్ రవాణా సాగుతోంది. గొలుగొండ మండలం పాకలపాడు, చీడిగుమ్మల, ఏటిగైరంపేట ప్రాంతాలలో నిత్యం గ్రావెల్ తవ్వకాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. ఇటీవల నర్సీపట్నం జోగినాదునిపాలెంలో ప్రభుత్వం పేదలకు జగనన్న ఇళ్ల స్థలాలకు కొండ ప్రాంతాన్ని చదును చేయించి ప్లాట్లుగా ఏర్పాటు చేశారు. ఆ స్థలాలు ఇంకా ఎవరికి కేటాయించ కుండానే మట్టి రవాణా చేస్తున్నారు. ముఖ్యమంత్రి సభకు జోగినాధునిపాలెం కొండ నుండి మట్టిని సభా ప్రాంగణం, హెలిపాడ్ ప్రాంతాల్లో చదును చేసేందుకు వైసిపి పార్టీకి చెందిన వ్యక్తికి అప్పగించారు. ఇదే అదునుగా భారీ ఎత్తున రవాణా చేపట్టారు. సీఎం సభా ప్రాంగణం చదును చేసేందుకు ఉపయోగించిన మట్టి కంటే బయటకు తరలించిన మట్టే ఎక్కువ కావడం విశేషం. ముఖ్యమంత్రి సభ ముగిసిన మరుసటి రోజు అర్ధరాత్రి వరకు యదేచ్ఛగా గ్రావెల్ రవాణాకు పాల్పడ్డారు.గతంలో కూడా అన్నవరం కొండను తవ్వి గ్రావెల్ తరలించినప్పుడు అధికారులు కేసు నమోదు చేశారు. గొలుగొండ మండలంలో గ్రామాధికారుల కనుసన్నల్లోనే గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నట్లు సమాచారం. అక్రమ మైనింగ్ వ్యాపారాలు చేస్తూ ఎమ్మెల్యేకు, పార్టీకి చెడ్డ పేరు తీసుకొస్తున్నట్టు పార్టీలో కొంతమంది బహిరంగంగా విమర్శలు చేస్తున్నారు.

నర్సీపట్నం పరిసర మండలాలలో నిత్యం తవ్వకాలతో కోట్లాది రూపాయలు కూడబెట్టి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. అధికారులకు సమాచార హక్కు ప్రచార ఐక్యవేదిక ప్రజా సంఘాలు తెలియజేసినప్పటికీ ఎటువంటి స్పందన లేదు. మైనింగ్ శాఖకు నష్టం కలిగిస్తూ మట్టి మాఫియా చెలరేగిపోతూ అధికార పార్టీ అండదండలతో అక్రమ గ్రావెల్ తవ్వకాలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. గ్రామాల నడిబొడ్డు నుండి మట్టి రవాణా చేపట్టడంతో దుమ్ముదూళి చెలరేగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు ఈ విషయంపై నిలదీసినప్పుడు ఒకరోజు ఆపేసి మరుసటి రోజు యధావిధిగా తవ్వకాలు, రవాణా చేపడుతున్నారు. గట్టి నిఘా ఏర్పాటు చేస్తేనే ఈ అక్రమ రవాణాను అరికట్టవచ్చు.

జోగునాదునిపాలెం వద్ద తవ్విన కొండ

నాటికను ప్రదర్శిస్తున్న కళాకారులు

ఆకట్టుకున్న 'మంచం మీద మనిషి' నాటిక

ప్రజాశక్తి-మాడుగుల:సంక్రాంతి సంబరాలలో భాగంగా మాడుగులలో భారత నిర్మాణ సేన అధ్వర్యంలో సంక్రాంతి రోజున ప్రదర్శించిన నాటిక ఆకట్టుకుంది. పాత్రికేయులు సురేష్ శాంతో దర్శకత్వంలో అప్పలాచార్య రచనతో ప్రదర్శించిన నాటికను పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు తిలకించారు. భజగోవిందం పాత్రలో లకిడ పు సుందరారాజు, డాక్టర్ కైలాసంగా జా గాని ఈశ్వరరావు, సీతాపతిగా గర్బాబు దామోదరం, పెద్ద కొడుకు, రెండో కొడుకు, మూడో కొడుకుల్లా సురేష్ శాంతో, బైరా శ్రీను, తాడి గణేష్, శంఖం, గంట వాళ్ళుగా యూసఫ్, కాసిమ్, ఫారిన్ డాక్టర్‌గా సూర్యారావు, కాంపౌండర్‌గా తూరుబిల్లి అర్జున తదితరులు నటించారు. సంగీతం పేలూరి నారాయణరావు, మేకప్ అనకాపల్లికి చెందిన శివాజీ నిర్వహించారు.కొద్ది కాలం తరువాత ప్రదర్శించిన ఈ నాటికను పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు తిలకించారు. నాటిక అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ట్రస్ట్‌కు లక్ష రూపాయలు విరాళం అందించిన బుచ్చయ్య చౌదరి, బసవ పున్నామ్మ, కుమార్తె పావని, అల్లుడు కోడె దుర్గాప్రసాద్‌తో పాటు, మాజీ సర్పంచ్ నాటిక పర్యవేక్షణ వహించిన దంగేటి సూర్యారావు దర్శకత్వం వహించిన సురేష్ శాంతో తదితరులకు సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భమిడి పాటు శాస్త్రి, తవ్వా సన్యాసిశెట్టి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా బుల్లి తెర నటుడు, గ్రామానికి చెందిన గౌరీపట్నం ప్రసాద్ వ్యవహరించారు.

ఒకే చోట కలిసిన కుటుంబ సభ్యులు

అపూర్వ కలయిక

ప్రజాశక్తి-మాడుగుల:సంక్రాంతి సందర్భంగా నాలుగు తరాలకు చెందిన కుటుంబం అనేక సంవత్సరాల తరువాత ఒకేచోట చేరి సంబరాలు జరుపుకుంటున్నారు. మాడుగుల చెందిన రాకుర్తి సూర్యనారాయణ, నారాయణమ్మలకు చెందిన కుమారులు, కుమార్తెలు వారి పిల్లలు, మనుమలు, మనవరాళ్లు సహా భోగి రోజున మాడుగుల చేరి ఉత్సాహంగా సంక్రాంతి పండగ నిర్వహించినారు. రాష్ట్రం లోని వివిధ ప్రాంతాలలో ఉపాధి ఉద్యోగ అవకాశాలు కోసం నివసిస్తున్న వీరంతా కొద్ది సంవత్సరాల తర్వాత ఒకే చోట కలిశారు. రాకుర్తి వీర్రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సదరు కుటుంబానికి చెందిన ఆర్టీసీ ప్రసాద్, భూషణం, వెంకటరావు, అజయ్, పురుషోత్తం ఇతర కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు సుమారు ఈ కుటుంబ సభ్యులు 70 మంది వరకు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న దీపారాధన

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని సిహెచ్. నాగాపురం గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా రామాలయం వద్ద దీపారాధన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మహిళలు, యువతులు అధిక సంఖ్యలో వచ్చి దీపాలు వెలిగించారు.

గ్రామాల్లో తీర్థాల సందడి

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పాతకృష్ణదేవి పేటలో సోమవారం తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహిచారు. ఈ కార్యక్రమానికి నాగపురం, కొంగసింగి, రత్నంపేట, ఏఎల్‌పురం గ్రామాల భజన బృందం సభ్యులు ప్రదర్శించిన చిడతలు, కోటాటం ఆకట్టుకున్నాయి.

నక్కపల్లి:మండలంలో ఉపమాక గ్రామంలో కనుమ సందర్భంగా సోమవారం తీర్థం జరిగింది. చిన్న చిన్న దుకాణాలు వెలసాయి. తీర్థంలో చిరువ్యాపారులు బొమ్మలు, ఆట వస్తువులు తదితర సామాగ్రి అమ్మకాలు చేపట్టారు. చుట్ట ప్రక్కల గ్రామాల నుంచి పెద్దలు, యువకులు, పిల్లలు అని తేడా లేకుండా జనం తరలివచ్చారు. తీర్థంలో సందడి చేసారు. పిల్లలు ఆట వస్తువులు కొనుగోలు చేసారు. యాదవులు తాడి పెద్దుల ప్రదర్శన చేసారు. తీర్థం సందర్భంగా ఉపమాకలో జనం రద్దీ కనిపించింది.

తీర్థంలో కొనుగోలు చేస్తున్న జనం

ఉపమాకలో కనుమ వేడుకలు

వైభవంగా వెంకన్న గిరిప్రదక్షణం

ప్రజాశక్తి-నక్కపల్లి:ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వేంకటేశ్వరస్వామి రాజాధిరాజ అలంకరణతో సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం గరుడాద్రి పర్వతం చుట్టూ పుణ్యకోటి వాహనంపై వెంకన్న రాజాధిరాజా అలంకరణతో వైభవంగా గిరి ప్రదక్షణోత్సవాన్ని నిర్వహించారు. సుదూరు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి గిరిప్రదక్షణోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం బంధుర సరస్సు వద్ద మండపంలో ప్రత్యేక పూజలు ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాదాచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం తిరువీధి సేవ నిర్వహించారు. భారీగా మందు గుండు సామాగ్రి పేల్చారు. వెంకన్న ఆలయ ప్రాంతం భక్తుల రద్దీతో జనసంద్రంగా దర్శన మిచ్చింది.

నగరంలో సంక్రాంతి వేళ...

విశాఖ నగరంలో సంక్రాంతికి జనం స్వగ్రామాలకు తరలి వెళ్లారు. దీంతో, పలు చోట్ల రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. మరో వైపు బీచ్ వద్ద పలువురు సందడి చేశారు. పతంగులను ఎగుర వేస్తూ ఉత్సాహంగా గడిపారు. మాంసం ప్రియులు చికెన్, మటన్ దుకాణాల వద్ద బారులు తీరారు.

నిర్మానుష్యంగా రోడ్డు

చికెన్ దుకాణం వద్ద జనం

బీచ్‌లో పతంగులను ఎగుర వేస్తున్న ప్రజలు